

సోమశిలకు 10,117 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



అనంతసాగరం, ఆగస్టు 13: సోమశిల జలాశయా నికి ఎగువ నుంచి మంగళ వారం 10,117 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 19.490 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

9 చోట్ల అన్న క్యాంటీన్లు

● రేపటినుంచి ప్రజలకు అందుబాటులోకి..

నెల్లూరు (సిటీ) : టీడీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అన్న క్యాంటీన్లను పంద్రాగస్టున ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. జిల్లావ్యాప్తంగా తొమ్మిది చోట్ల ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారు.



నెల్లూరులో సిద్ధమైన అన్న క్యాంటీన్

నెల్లూరులో ఏసీ కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్, ఇరిగేషన్ సర్కిల్, ఇందిర భవన్, బాలభవన్, పాతమున్సిపల్ కార్యాలయం, పొదలకూరురోడ్డులోని సెరికల్చర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కందుకూరులోని పాత చేపల మార్కెట్, కావలిలోని తహసీల్దారు కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ క్యాంటీన్లలో సామాన్య ప్రజానీకానికి రూ.5లకే భోజనం అందివ్వనున్నారు.

స్వాతంత్ర్య వెలుగులు



విద్యుద్దీప వెలుగుల్లో కలెక్టరేట్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కలెక్టరేట్ ముస్తాబయ్యింది. రంగు రంగుల విద్యుద్దీపాల అంకరణతో కలెక్టరేట్ వెలుగులు విరజిమ్ముతోంది. ఈ నెల 15వ తేదీన కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్ పతాకావిష్కరణ చేయనున్నారు. అలాగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగే పోలీస్ కవాతు మైదానంలోనూ ఏర్పాట్లు విస్తృతంగా జరుగుతున్నాయి. ఉదయం 9 గంటలకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ జాతీయ జెండాను ఎగరవేస్తారని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం మంత్రి సందేశం, ప్రజాప్రతినిధులు, సమరయోధులు, వివిధ రంగాలలో సేవలందించిన ప్రముఖుల పరిచయ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఆ తర్వాత ప్రచార శకటాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, విశిష్ట సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

\- నెల్లూరు (హరనాథపురం)



పోలీస్ కవాతు మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లు

రంగడి సన్నిధిలో పవిత్రోత్సవాలు ప్రారంభం



నెల్లూరు (సాంస్కృతికం) : తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో జరిగే నిత్యపూజలు, ఉత్సవాలలో తెలిసో, తెలియక జరిగిన దోష నివారణల కోసం నిర్వహించే పవిత్రోత్సవాలు ఆరంభమయ్యాయి. సాయంత్రం అంకురార్పణ, హోమాలు జరిగాయి. విశేష అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఆకట్టుకున్నారు. బుధవారం సాయంత్రం 4.30 గంటలకు పవిత్ర ప్రతిష్ఠ, తిరుమంజనం, హోమాలు, పవిత్ర సమర్పణ జరగనున్నట్లు ఆ ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

నగర పరిధిలోని అక్కచెరువుపాడులో రూ.కోట్లు విలువైన ఆస్తిపై చాలాకాలంగా కొందరి కళ్లు పడ్డాయి. గత ప్రభుత్వంలో ఒక దొంగ పట్టా సృష్టించి, రెవెన్యూ రికార్డుల్లోకి తమ పేర్లు ఎక్కించుకున్నారు. ఇప్పుడు ఏకంగా ఆ భూమిని లేఅవుట్‌గా మార్చి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకు సంబంధించి ల్యాండ్ కన్వర్షన్‌కు కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల సమయంలో పక్క జిల్లాకు చెందిన తహసీల్దార్ ఈ అక్రమాలకు బ్రేకులు వేయగా ఇప్పుడు చకచకా ఫైలు కదులుతున్నట్లు రెవెన్యూ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

ప్రభుత్వ భూమికి ఫేక్ పట్టా!

- అక్కచెరువుపాడులో బరితెగించిన అక్రమార్కులు
- పదెకరాలను అమ్మేసే ప్రయత్నాలు
- పాత పట్టా సృష్టి.. కొత్త సర్వే నెంబర్‌తో రికార్డులు
- లేఅవుట్ వేసేందుకు కన్వర్షన్‌కు దరఖాస్తు
- రెవెన్యూ వర్గాల తర్జనభర్జన

నెల్లూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడు రెవెన్యూ పరిధిలో పదెకరాల ప్రభుత్వ భూమిపై వివాదం కొనసాగుతోంది. టిడ్కో గృహాలకు సమీపంలోని విలువైన ఈ భూమిని చాలా కాలం నుంచి ఓ ఉన్నత వర్గానికి చెందిన వ్యక్తి తన ఆధీనంలో పెట్టుకొని ఉన్నారు. వాస్తవానికి ఈ భూమి ఉన్నది ఒక సర్వే నెంబర్లో అయితే సదరు వ్యక్తి ఆ భూమిని తనకు ఎప్పుడో దశాబ్దాల క్రితం ఇచ్చారంటూ మరో సర్వే నెంబరుతో కూడిన ఓ పట్టాను తీసుకొచ్చారు. అయితే అక్కచెరువుపాడు రెవెన్యూ రికార్డుల్లో ఆ సర్వే నెంబరే లేకపోవడం గమనార్హం. అసలు డైగ్లాట్‌లో లేని సర్వే నెంబర్లో భూమి ఉన్నట్లుగా పట్టా ఎలా ఇచ్చారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ పట్టాను ఆధారం చేసుకొని గత ప్రభుత్వంలో ఓ వివాదాస్పద సర్వేయర్ సదరు భూమి ఆ వ్యక్తిదేనంటూ రిపోర్టు కూడా ఇచ్చారని తెలిసింది. దాని ఆధారంగా వెబ్‌ల్యాండ్‌లో కూడా పేర్లు ఎక్కించినట్లు సమాచారం. అది కూడా సబ్ డివిజన్ చేస్తూ పేర్లు ఎక్కించడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. డైగ్లాట్‌లో లేని ఒక కొత్త సర్వే నెంబర్‌ను సృష్టించి ఆ సర్వే నంబర్లో భూమి వారికి ఇచ్చినట్లుగా చూపించి పాసుపుస్తకాలు కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పుడు దర్జాగా లేఅవుట్ వేసి ఆ ప్రభుత్వ భూమిని అమ్మేయాలని కుట్ర చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకుగానూ లేఅవుట్ కన్వర్షన్‌కు దరఖాస్తు కూడా చేసుకున్నారు. కానీ ఎన్నికల సమయంలో బాపట్ల జిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్ ఈ కన్వర్షన్‌కు అనుమతు ఇచ్చేందుకు నిరాకరించినట్లు సమాచారం. ఈ విషయాన్ని అప్పటి జిల్లా ఉన్నతాధికారులకు కూడా తెలియజేసినట్లు తెలుస్తోంది. అదే సమయంలో కొందరు గ్రామస్థులు కూడా ఈ ప్రభుత్వ భూమి వివాదాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. కానీ ఫలితం లేకపోవడంతో ఇప్పుడు తెరవెనుక రాజకీయ నేతలు ఈ భూమికి కన్వర్షన్ చేయించేందుకు ఉన్నత స్థాయిలో పావులు కదు పుతున్నట్లు కలెక్టరేట్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ కన్వర్షన్‌పై రెవెన్యూ సిబ్బంది తర్జనభర్జన పడుతున్నారు. ఇది ప్రభుత్వ భూమి అంటూ వివాదం జరుగుతుంటే ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కాగా దీనిపై నెల్లూరు రూరల్ తహసీల్దార్ లాజరస్‌ను వివరణ కోరగా తాను రాకముందు ఏవైనా ఫైళ్లు వచ్చాయో పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు.

దారి మళ్లిన జన వికాస్!


- ముస్లిం ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర పథకం
- నిధులను దారి మళ్లించిన అప్పటి వైసీపీ సర్కారు
- బిల్లులు రావన్న ఉద్దేశంతో పనులు ఆపేసిన కంట్రాక్టర్లు



నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 13 : ముస్లింల కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది. ప్రధానమంత్రి జన్ వికాస్ పథకం కింద ముస్లింల నివాస ప్రాంతాలలో ప్రాథమిక సౌకర్యాల కోసం నాలుగేళ్ల క్రితం రూ.10 కోట్లు మంజూరు చేసింది. అయితే, ఈ నిధులను కూడా అప్పటి ప్రభుత్వం లాగేసుకోవడంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు అర్థంతరంగా ఆపేసి వెళ్లిపోయారు.

● పథకం ఉద్దేశం

మైనార్టీల సామాజిక ఆర్థిక స్థితిని పెంపొందించడం, వారి జీవన నాణ్యతను మెరుగుపరచడానికి, అసమానతలు తగ్గించి ప్రాథమిక సౌకర్యాలు కల్పించటం ఈ పథకం ముఖ్యఉద్దేశం. విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి రంగాలలో మౌలిక సదుపాయాలు సృష్టించడానికి అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. అదే విధంగా ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్లు, సాంకేతిక వసతి గృహాలు, పాఠశాలల్లో అదనపు తరగతి గదులు నిర్మించాల్సి ఉంది. ప్రభుత్వ గుర్తింపు పొందిన మదరసా పాఠశాలల్లో కంప్యూటర్ల ఏర్పాటుతోపాటు ఇంటర్నెట్ వంటి సౌకర్యాలు కల్పించాలి.



10 యూనిట్ల మంజూరు

2011 జనాభా లెక్కల ప్రకారం మైనార్టీలు అధికంగా ఉండే ప్రాంతాలను కేంద్ర మైనార్టీ సంక్షేమ మంత్రిత్వ శాఖ గుర్తించింది. ఈ ప్రాంతాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి పూర్తి చేయాల్సి ఉంది. జిల్లాలో ఈ కార్యక్రమం కింద 2019-20 ఆర్థిక సంవత్సరంలో 10 యూనిట్ల పనులు మంజూరవగా, రూ.10 కోట్లు విడుదలయ్యాయి. నిధులతో ముస్లింలు ఎక్కువగా నివసిస్తున్న ఉదయగిరి ప్రాంతంలో తొలుత పనులను ప్రారంభించారు. అయితే, విడుదలైన నిధులు వైసీపీ ప్రభుత్వం తిరిగి తీసేసుకున్నట్లు సమాచారం. దీంతో కాంట్రాక్టర్లు నిధులు రావన్న ఉద్దేశంతో పనులను అర్థంతరంగా ఆపేసినట్లు తెలిసింది.

3 యూనిట్ల పనులే

జిల్లాకు మంజూరైన పది యూనిట్లలో మూడు యూనిట్ల పనులే ప్రారంభమయ్యాయి. మిగిలిన పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రానట్లు సమాచారం. ప్రారంభమైన మూడు యూనిట్ల పనులలో ఉదయగిరి మండలంలోని గండిపాళెం ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం, ఉదయగిరిలోని పాలిటెక్నిక్ కళాశాలలో పరిపాలనా భవన నిర్మాణం, ఉదయగిరిలోని వెంగళరావునగర్‌లోని జడ్పీహైస్కూల్లో నిర్మాణ పనులు ఉన్నాయి. ఈ పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్లు నిధులు దారి మళ్లాయని తెలిసి పనులను అర్థంతరంగా వదిలి వెళ్లినట్లు సమాచారం. నూతనంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావటంతో జిల్లాలో ప్రధాన మంత్రి జనవికాస్ కార్యక్రమం మళ్లీ ప్రారంభమై తమ ప్రాంతాలలో అభివృద్ధి పనులు జరుగుతా యన్న ఆశతో ముస్లింలు ఉన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి జనవికాస్ కింద ఉదయగిరి ప్రాంతంలో మూడు పనులను ప్రారంభించామని, పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు.

'సర్దుబాటు' కాని వ్యవహారం

తప్పుల తడకగా వివరాలు ● ఉపాధ్యాయ సంఘాలు నిరసన ● తప్పులు సవరించాలని ఆదేశాలు ● 17 నుంచి కౌన్సెలింగ్ నిర్వహణ



నెల్లూరు (విద్య), ఆగస్టు 13 : జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై టీచర్లు, సంఘాలు నిరసనలు తెలియచేయడంతో విద్యాశాఖ కమిషనర్ ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేశారు. అన్ని తప్పులను సవరించాక 17వ తేదీన కౌన్సెలింగ్ చేపట్టాలని ఆదేశించారు. టీచర్ల సర్దుబాటుకు సంబంధించి తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం విడుదల చేసిన జాబితాల్లో, ఖాళీల ప్రకటనలు అంతా అస్తవ్యస్తంగా ఉన్నాయని, వైసీపీ ప్రభుత్వంలో జరిగిన పద్ధతిలోనే ఈ కౌన్సెలింగ్ నిర్వహించడం తాము వ్యతిరేకిస్తున్నామంటూ ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేపట్టాయి. తమతో చర్చలు జరపకుండా, తమ సూచనలు పరిగణలోకి తీసుకోకుండా సర్దుబాటు చేపడితే అంగీకరించమని నాయకులు తేల్చి చెప్పారు. జిల్లావ్యాప్తంగా నిరసనలు వ్యక్తం కావడంతో విద్యాశాఖ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు కౌన్సెలింగ్‌ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 15న టీచర్ల నుంచి వినతులు స్వీకరించి, 16న కొత్త సీనియారిటీ జాబితాలు విడుదల చేయనున్నారు. వీటిలో అభ్యంతరాలు స్వీకరించి 17న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు.

● ఎస్‌ఎంసీ ఎన్నికలకు రెండో షెడ్యూల్

నెల్లూరు (విద్య) : జిల్లాలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలకు సంబంధించి ద్వితీయ షెడ్యూల్ విడుదలైంది. జిల్లావ్యాప్తంగా 2,622 పాఠశాలలు ఉండగా వీటిలో 2611 పాఠశాలలు ఎన్నికలకు ఎంట్రీలు నమోదు చేసుకోగా 8వ తేదీన జరిగిన ఎన్నికల్లో 1980 పాఠశాలల్లో ఏకగ్రీవం అయ్యాయి. 604 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకున్నారు. పలు రకాల కారణాలతో వాయిదా పడిన 27 పాఠశాలల్లో తిరిగి ఎన్నికలు నిర్వహిం చేందుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా మంగళవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలతో డీఈఓ రామారావు సమీక్షించారు. ఇటీవల జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎస్‌ఎంసీ ఎన్నికల తీరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా ఎన్నికలు వాయిదా పడిన అంశాలను సీరియస్‌గా తీసుకుని అందుకు గల కారణాలను వెంటనే తెలియచేయాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. దీనిపై డీఈవో సమీక్షించి ఆ నివేదికలను అధికారులకు, ప్రజా ప్రతి నిధులకు అందచేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

గతంలో జరిగిన నీరు-చెట్టు పనుల బిల్లులన్నింటినీ చెల్లించేందుకు ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తొలుత కోర్టుల్లో ఉన్న బిల్లుల చెల్లింపునకు రూ.256 కోట్లు విడుదలకు ఉత్తర్వులిచ్చింది. ఈ బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించింది. జిల్లాకు సంబంధించి ప్రస్తుతం కోర్టుల్లో 748 కేసులు పెండింగ్‌లో ఉండగా, వాటికి రూ.65 కోట్లు చెల్లించాల్సి ఉంది. తొలి విడత ఈ బిల్లులను చెల్లించనున్నారు. ఆ తర్వాత మిగిలిన బిల్లులను కూడా చెల్లించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

\- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

హమ్మయ్య.. బిల్లులొచ్చాయ్!

- ఐదేళ్ల తర్వాత చెల్లింపులకు కూటమి ప్రభుత్వం నిర్ణయం
- 'నీరు-చెట్టు'కు రూ.256 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు
- జిల్లాలో రూ.100 కోట్లకుపైగా బకాయిలు
- కోర్టుకేసు బిల్లుల్ని వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశం

2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వంలో జిల్లాలో నీరు-చెట్టు పథకం కింద 13,780 పనులు మంజూరవగా సుమారు పది వేల వరకు పనులు పూర్తయ్యాయి. సుమారు రూ.711 కోట్లతో పనులు చేశారు. చివరి రెండేళ్లలో జరిగిన పనులకే ఎక్కువగా బిల్లులు పెండింగ్ ఉన్నాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి జిల్లాలో 3,398 వర్కులకుగానూ సుమారు రూ.226 కోట్ల వరకు నీరు - చెట్టు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ టీడీపీ నాయకులు చేసిన పనులని భావించి వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఆపేసింది. ఐదేళ్లపాటు ఎన్ని ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు. దీంతో కాంట్రాక్టర్లు ఒక్కొక్కరుగా హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ధర్మాసనం బిల్లుల చెల్లింపునకు ఆదేశించింది. ఇలా హైకోర్టు నుంచి బిల్లుల చెల్లింపునకు ఆదేశాలు వస్తుండడంతో నాటి ప్రభుత్వం విచారణలను తెరమీదకు తెచ్చింది. నీరు-చెట్టు పనులపై విచారణ జరుపుతున్నాం.. పూర్తయ్యాక బిల్లులు చెల్లిస్తాం.. అంటూ హైకోర్టుకు నివేదించారు. ఇలా విచారణల పేరుతో బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేస్తూ వచ్చింది.

● పోరాడి సాధించుకున్న కాంట్రాక్టర్లు



వైసీపీ ప్రభుత్వ కక్షసాధింపుతో విసిగెత్తిపోయిన నీరు-చెట్టు కాంట్రాక్టర్లు హైకోర్టు మెట్లెక్కి విజయం సాధించారు. రిట్ పిటిషన్ దాఖలయ్యాక హైకోర్టు ఆదేశించినా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో మళ్లీ కోర్టు ధిక్కరణ పిటిషన్లు వేశారు. అప్పటికిగానీ ప్రభుత్వం దిగి రాలేదు. ఇలా గడిచిన రెండేళ్లుగా అనేకమంది హైకోర్టు ద్వారా సుమారు రూ.105 కోట్ల బిల్లులు సాధించుకున్నారు. అయితే సుమారు రూ.100కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉంది. ఇంకా వేల కేసులు కోర్టులో ఉన్నాయి. కొన్ని కంటెంప్ట్ దశలో, మరికొన్ని రిట్ పిటిషన్ స్థాయిలో నమోదై ఉన్నాయి. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం బిల్లులు చెల్లించాలని నిర్ణయం తీసుకోవడంతో వీరంతా ఊపిరి పీల్చుకుంటున్నారు. నీరు-చెట్టు కేసులు ఇరిగేషన్ అధికారులను కూడా అతలాకుతలం చేశాయి. ఒక్క నెల్లూరు జిల్లాలోనే 1,266 వరకు కేసులు నమోదయ్యాయి. వీటికి కౌంటర్లు వేసుకోవడం, కంటెంప్ట్ కేసులకు జేబుల్లో నుంచి వకాలత్ ఖర్చులు భరించడం ఇరిగేషన్ అధికారులను మానసికంగా, ఆర్థికంగా తీవ్రంగా కుంగదీసింది. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో వీరికి కూడా ఉపశమనం లభించింది.

వామ్మో.. వైట్ స్పాట్!

- రొయ్యల సాగుదారులను వణికిస్తున్న వైరస్
- నష్టాలను మూటగట్టుకుంటున్న రైతులు



వైట్‌స్పాట్‌తో పట్టేసిన రొయ్యలు

అల్లూరు, ఆగస్టు 13 : ఆక్వా రంగాన్ని వైరస్ వణికించేస్తోంది. ఇందుకూరుపేట మండలం నుంచి కావలి మండలం తీరప్రాంతం వరకు సాగులో ఉన్న రొయ్యలపై 'వైట్ స్పాట్' తన ప్రభావం చూపుతోంది. మహమ్మారి కరోనా విజృంభణ తర్వాత రొయ్యల సాగు ఆశాజనకంగా లేదు. ఈసారి కూడా దాదాపు 30 వేల ఎకరాల్లోనే రొయ్యల సాగు చేపట్టారు. సాగులో ఉన్న వెనామీ రకం రొయ్యలకు వైట్‌స్పాట్ సోకుతోంది. ఈ వైరస్ ఒక్క దగ్గర ప్రభావితమైతే తీరప్రాంతమంతా విస్తరిస్తోంది. క్రీక్‌లో ఈ వైరస్ విస్తరించడం వల్ల నీటి మార్పుల్లోనూ, పక్షులు, మూగజీవాల సంచారం కారణంగా ఈ వైరస్ సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అల్లూరు మండలం తీరప్రాంతమైన కుర్రు ప్రాంతంలోని రొయ్యల గుంతల్లో ఈ వైరస్ సోకి ఓ రైతుకు చెందిన అరటన్ను రొయ్యలు మృతి చెందాయి. దీంతో అప్పటికప్పుడే ఆ రొయ్యలను పట్టుకోవాల్సి వచ్చింది. సుమారు రూ.12 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

● స్వల్పంగా పెరిగిన ధరలు

ఇటీవల వెనామీ రకం రొయ్యలను అత్యధికంగా సాగు చేస్తున్నారు. గతంతో పోల్చితే ప్రస్తుతం వెనామీ ధరలు కొంత మేర పెరిగాయి. 100 కౌంట్ ధర ప్రస్తుతం రూ.250 వరకు పలుకుతుండటంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈదఫా రొయ్యల సాగు చేస్తే అప్పుల్లో నుంచి బయట పడవచ్చనే సదుద్దేశంతో రొయ్యల సాగు చేపట్టగా, 'వైట్‌స్పాట్' సాగుదారులను ముంచేసింది.

● పెరిగిన పెట్టుబడులు

ఆక్వా రంగంలో ప్రధానంగా చెప్పుకునేది రొయ్యల పెంపకమే. ఐదేళ్ల క్రితం వరకూ ధరలు నియంత్రణలో ఉండగా రైతులకు కిలోకు రూ.20 నుంచి 30 మిగులుతూ ఉండేది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సాగులో పెట్టుబడి వ్యయం పెరగడం ఆదాయం తగ్గడంతో రొయ్యల పెంపకం ముగించుకుంటున్నారు. ఒక ఎకరా విస్తీర్ణంలో రొయ్యల సాగు చేపట్టేందుకు రొయ్య పిల్లల ధర గతంలో రూ.50 వేలు ఉండగా ప్రస్తుతం రూ.80 వేలు అవుతోంది. గతంలో ఫ్యాక్టరీ మేత ధర కిలో రూ.64 ఉండగా ప్రస్తుతం రూ.84 ఉంటోంది. ఇక అరువు అయితే రూ.94 చెల్లించాల్సిందే. ఆక్వా రంగంలో కీలకమైన విద్యుత్ సరఫరా కూడా ఖర్చుతో కూడుకున్నదిగా మారిపోయింది. గతంలో యూనిట్ ధర రూ.2 ఉండగా ప్రస్తుతం రెండు గ్రేడ్లుగా విభజించి ఆక్వా జోన్‌కు రూ4.20, నాన్ ఆక్వా జోన్‌కు రూ.6.50 చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇలా ధరలు పెరగడంతో రొయ్యల సాగు చేపట్టేందుకు రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.



రొయ్యలు పట్టేసి గుంటను ఖాళీ చేస్తున్న కూలీలు

● వైట్‌స్పాట్‌తో భారీ నష్టాలు

నాలుగేళ్ల క్రితం ఇదే వైట్ స్పాట్ వైరస్ విజృంభణతో రైతులకు భారీ నష్టాలు వాటిల్లాయి. ప్రస్తుతం అదే పరిస్థితి పునరావృతమైంది. అల్లూరు మండలం తీరప్రాంతంలో వైట్‌స్పాట్ దాటికి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన రొయ్యల సాగు ఏ క్షణం ఏమవుతుందోననే భయంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

అప్పులన్నా తొలుగుతాయని సాగు చేపట్టాం



పదేళ్లుగా రొయ్యల సాగు చేస్తున్నారు. గతంలో నష్టాలు వచ్చాయి. ఈ ఏడాదైనా ఆశాజనకంగా సాగు ఉంటుందని, అప్పులైనా తీరుతాయని భావించాము. కానీ పరిస్థితి భయానకంగా ఉంది. వైట్‌స్పాట్ వైరస్ దాటికి దేవుడిని తలుచుకుంటున్నాం.

\- కత్తుల విజయ్‌కుమార్, అల్లూరు

ఒక్కపూటకి అరటన్ను చనిపోయాయి!



వైట్‌స్పాట్ దాటికి అరటన్ను రొయ్యలు మృతి చెందాయి. ఈ వైరస్‌ను గుర్తించేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. వ్యయప్రయాశలకోర్చి చేపట్టే రొయ్యల సాగులో తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. ఈ విధంగా రెండు దఫాలు నష్టాలు ఏర్పడితే ఉన్న ఆస్తులు అమ్ముకోవాల్సిందే.

\- నీలపరెడ్డి హరీశ్‌రెడ్డి, అల్లూరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

మైనార్టీల సంక్షేమానికి 15 శాతం నిధులు

● కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 13 : ప్రధాన మంత్రి 15 సూత్రాల కార్యక్రమం అమలులో మైనార్టీలకు 15 శాతం నిధులను తప్పనిసరిగా వినియోగించాలని కలెక్టర్ ఆనంద్ ఆదే శించారు. ఈ కార్యక్రమంపై కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం అమలు చేస్తున్న 25 శాఖలలో అధికారులు లక్ష్యాలను నిర్ధారించుకొని ప్రతి పథకంలో 15 శాతం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి కేటా యించి ఖర్చు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమాధికారి ఎం శ్రీని వాసరావు, సమగ్రశిక్ష ఏపీడీ ఉషారాణి, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, మెప్మా పీడీ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

జామాయిల్ చెట్లలో వృద్ధుడి మృతదేహం

కొండాపురం, ఆగస్టు 13: మండలంలోని రేణుమాల గ్రామ పొలం శివార్లలో జామా యిల్ చెట్లల్లో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వివరాల మేరకు.. మంగళవారం గ్రామానికి చెందిన కొందరు పశువుల కాపరులు గ్రామ శివారు వైపు వెళ్లగా సుమారు 55 ఏళ్ల వ్యక్తి మృతదేహం వారికంట పడింది. మృతదేహం ఉన్న తీరునుబట్టి సుమారు 20 రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. గ్రామ ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి మల్లికార్జున ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహేంద్ర కలిగిరి సీఐ వెంకట నారాయణతో కలసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వారి విచారణలో 20 రోజుల క్రితం గ్రామ పశువుల కాపరులకు గుర్తుతెలి యని ఓ వ్యక్తి పొలాల్లో కనిపించాడని, ఎవరు, ఇక్కడ ఎందుకు ఉన్నావని ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానం చెప్పాడని పోలీసుల దర్యాప్తులో తెలిసింది. మృతదేహం కుడిచేతికి లక్ష్మీ నరసింహస్వామి డాలర్, ఎడమచేతికి రాగి కడియం, రెడీమెడ్ షర్ట్, లుంగీ, 90 సెంటీమీటర్ల ఫుల్ డ్రాయరు ఉన్నాయన్నారు. మండలంతోపాటు ఇతర ప్రాంతాలలో ఎవరైనా కనిపించ కుండా ఉంటే వారి పూర్తి వివరాలతో పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 13: బుచ్చిరెడ్డిపాళెం బస్టాండ్ సెంటర్ పోలీస్ ఔట్ పోస్టు పక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి(47) మృతదేహాన్ని మంగళవారం ఉద యం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. వెం టనే సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీ లించి వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలిం చారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడు ఎర్రటి టీషర్టు, బ్లూ జీన్స్‌ప్యాంటు, తలకు నల్లనిటోపి ధరిం చి ఉన్నాడు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



బుచ్చి బస్టాండ్ సెంటర్‌లో పోలీస్ ఔట్‌పోస్టు పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గుర్తుతెలియని వృద్ధుడు..

నెల్లూరు(క్రైం), ఆగస్టు13: నెల్లూరులోని కరెంట్ ఆఫీసు సెంటర్‌లో ఓ మూతపడిన దుకాణం వద్ద గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతదేహాన్ని గమనించిన స్థానికులు వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు ఎవరని తెలుసుకునే ఆధా రాలు లభ్యం కాకపోవడంతో కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

ఆత్మకూరు, ఆగస్టు 13: స్థానిక ఆంధ్ర ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలోని నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మర్రిపాడు మండలం కదిరినేనిపల్లికి చెందిన షేక్ షాలేహ (28) మరణించాడు. ఆత్మకూరుకు వచ్చి తిరి గి అతని స్వగ్రామానికి మోటారుబైక్‌పై వెళుతుండగా బద్వేల్ నుంచి నెల్లూరు వైపు వెళ తున్న కారు ఢీ కొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అతడు అవివాహితుడు. సమా చారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మృ తుడి కుటుంబసభ్యులకు తెలిపారు. మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిం చారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

నెల్లూరు(క్రైం), ఆగస్టు13: వైద్యశాలలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని సంతపేట గుండాల సుబ్బారెడ్డితోటకు చెందిన విజయకుమార్(42), అముద దంపతులు. వారికి ఇద్దరు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నారు. విజయ్‌కుమార్ గిడ్డంగివీధిలో జూస్ షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే అతను మద్యానికి బానిసవడంతో ఇటీవల ఆరోగ్యం క్షీణించింది. ఈ నెల 11వ తేదీ ఇంట్లో పూటుగా మద్యం సేవించి మంచంపై పడుకొన్నాడు. కొద్దిసేపటికి తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి రాయవేలూరులోని సీఎంసీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే పరిస్థితి చేయిదాటిందని చెప్పడంతో నెల్లూరుకు తీసుకువచ్చారు. జీజీహెచ్‌లో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. విజయకుమార్ భార్య సంతపేట పోలీసుల కు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ వైద్యులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

చికిత్స పొందుతూ మహిళ..

అల్లూరు, ఆగస్టు 13 : ప్రమాదంలో తీవ్ర గాయాలైన మహిళ చికిత్స పొందుతూ సోమ వారం రాత్రి మృతి చెందింది. నార్తుమోపూరుకు చెందిన మహిత అనే యువతి స్కూటీపై వెళ్తుండగా నీటి బిందెతో రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొంది. ఈ ఘటనలో ఆమె డివైడ ర్‌పై పడి తలకు తీవ్రగాయాలయ్యాయి. చెవుల్లో నుంచి రక్తస్రావమై అపస్మారక స్థితిలోకి చేరుకుంది. ఆమెను చికిత్స నిమిత్తం హుటాహుటిన అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కులదూషణ కేసుపై డీఎస్పీ విచారణ

మనుబోలు, ఆగస్టు 13: కులదూషణ కేసుపై నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీని వాసరావు మంగళవారం కొమ్మలపూడి గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ నెల 6వ తేదీన తనను కులంపేరుతో దూషించారంటూ గ్రామంలోని గిరిజనకాలనీకి చెందిన పాలెం పాటి సుబ్బరాయుడు, చెందులూరు శ్రీనువాసు లుతో పాటు నలుగురు వ్యక్తులపై 11వ తేదీన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. విచా రణలో భాగంగా డీఎస్పీ జాతీయ రహదారి పక్కనున్న పొలాల వద్ద గిరిజనులతో మాట్లా డారు. సర్వేనెం.23-2లో ఎంతమంది గిరిజనులకు ఎంతమేర భూములు ఉన్నాయి. వారిలో ఎవరెవరికి పట్టాలున్నాయన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. భూముల విషయం తహసీల్దార్‌ను అడిగి వివరాలు సేకరించి తదుపరి విచారణ జరుపుతామని డీఎస్పీ తెలి పారు. ఆయన వెంట సీఐ రాంబాబు, ఎస్ఐ అజయ్ కుమార్ ఉన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఆగస్టు13: మామను హత్య చేసిన కేసులో చిన్నబజారు పోలీసులు మంగళవారం అల్లుడిని అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరు రూరల్ మండలం నవలాకులతోట ప్రాంతంలో ఎండీ ఆసీఫ్(53), నమీనా దంపతులు నివసిస్తుండే వారు. వారి పెద్ద కుమార్తెను నెల్లూరు లోని రంగనాయకులపేట రైలు వీధికి చెందిన కార్పెం టర్ షఫీకి ఇచ్చి వివాహం చేశారు. ఆ దంపతుల నడుమ విబేధాల నేపథ్యంలో షఫీ భార్య మూడు నెలలుగా పుట్టింట్లో ఉంటోంది. భార్యను కాపురానికి పంపాలని షఫీ కోరగా పెద్దలతో మాట్లాడి పంపుతా నని ఆసీఫ్ చెబుతూ వచ్చాడు. దీంతో మామపై కక్షపెంచుకున్న షఫీ ఈ నెల 11వ తేదీ రాత్రి మద్రాసు బస్టాండు వద్ద పూలు అమ్ముకుంటున్న ఆసీఫ్‌ను హత్యచేసి పరారయ్యాడు. ఆసీఫ్ భార్య సమీనా ఫిర్యాదు మేరకు చిన్నబజారు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. మంగళవారం పుత్తా ఎస్టేట్ వద్ద నిందితుడిని అరెస్ట్ చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	105
లేయర్ లైవ్	95
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220
లేయర్	161

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6755
వెండి కిలో ధర	రూ. 83,000
వెండి ఒక గ్రాము	రూ. 86.00

రామాపురం కార్యదర్శిపై విచారణ



విచారణ చేపడుతున్న డీఎల్పీవో కృష్ణమోహన్

వరికుంటపాడు, ఆగస్టు 13: స్థానిక మండల కార్యాలయంలో మంగళవారం కందుకూరు డీఎల్పీవో కృష్ణమోహన్ రామాపురం పంచాయతీ కార్య దర్శి ప్రభుదాస్‌పై విచారణ చేపట్టారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఆయన బీఎల్వోగా విధులు నిర్వర్తించారు. ఈ సమయంలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను తనతో పాటు సహచర ఉద్యోగులకు ఇవ్వకుండా ఎంపీ డీవో వెంకటకృష్ణకుమారి అక్రమాలకు పాల్పడ్డారని అప్పట్లో ఆర్వోకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తనపై అసత్య ఆరోపణలు చేయడంతో పాటు ఇతర ఉద్యోగులను సైతం ప్రలోభాలకు గురి చేస్తున్నాడని ఎం పీడీవో సైతం ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసింది. అనంతరం ఆ కార్యదర్శిని సస్పెన్షన్ చేసిన ఉన్నతాధికారులు విచారణకు ఆదేశిం చారు. దీంతో విచారణ చేపట్టిన డీఎల్పీవో నివేదికను ఉన్నతాధికా రులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచు దిలీప్‌కు మార్, ఈవోపీఆర్డీ సికిందర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఆఫ్రాన్ పనులు

● పర్యవేక్షణ కరువు

అనంతసాగరం : సోమశిల జలాశయం వద్ద గత ప్రభుత్వంలో ఆగిన ఆఫ్రాన్ అభివృద్ధి పనులు గతకొన్ని రోజులుగా ముమ్మరంగా జరుగుతున్నాయి. గుంతల్లో ఉన్న వ్యర్థాలను తొలగించి కాంక్రీట్ మిశ్రమం నింపుతున్నారు. అయితే మంగళవారం సాయంత్రం పనులు వద్ద పర్యవేక్షణ ఇంజనీర్లు లేకుండా చేస్తున్న తీరుతో స్థానికులు మండిపడుతున్నారు.

ఉత్సాహంగా జీవ వైవిధ్యం పోటీలు

● విజేతలకు రేపు బహుమతులు


నెల్లూరు (విద్య), ఆగస్టు 13 : జీవ వైవిధ్యం పరిరక్షణలో యువత పాత్ర అనే అంశంపై ఏపీ బయో డైవర్సిటీ, జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు జిల్లా స్థాయిలో వక్తృత్వం, చర్చ, షార్ట్ ఫిలిం పోటీలు నిర్వహించారు. జిల్లా కోఆర్డినేటర్ కే బాబునాయుడు మాట్లాడుతూ విద్యార్థులు ఈ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొని వారి ప్రతిభను చాటారన్నారు. విజేతలకు ఆగస్టు 15వతేదీన జిల్లా కలెక్టర్ నుంచి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందచేస్తామని తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సైన్స్ ఉపాధ్యాయులు ఫణికు మార్, ప్రసూన, హరిబాబు, రామారావు వ్యవహరించగా, పాఠశాల హెచ్‌ఎం కృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

విజేతలు వీరే...

వక్తృత్వ పోటీల్లో విడవలూరు మండలం ఊటు కూరు జడ్పీహెచ్ఎస్‌కు చెందిన డీ వర్షిక ప్రథమ స్థానం, దర్గామిట్ట జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎస్‌కే కరిష్మా ద్వితీయ, చెముడుగుంట జడ్పీహెచ్ఎస్‌కు చెం దిన వై ఆశ్రిత తృతీయ స్థానం సాధించారు. అలాగే చర్చ (డిబేట్) పోటీల్లో చెముడుగుంట జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎన్ దివ్య-ఎన్ వినిత ప్రథమ, ఊటుకూరు జడ్పీహెచ్ఎస్‌కు చెందిన డీ వర్షిక-పల్లవి ద్వితీయ, నార్త్‌రాజు పాళెం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన సీహెచ్ ప్రణీత పల్లవి-కే సంకీర్తన తృతీయస్థానం దక్కించుకున్నారు. అదేవిధంగా షార్ట్ ఫిల్మ్ విభాగంలో నార్త్‌రాజుపాళెం జడ్పీహెచ్ఎస్ ప్రథమ స్థానం, మనుబోలు జడ్పీ పాఠశాల ద్వితీయ, చాకలికొండ ప్రభు త్వ ఉన్నత పాఠశాల తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి.

తుపాకీతో కాల్చి హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు

నెల్లూరు (లీగల్), ఆగస్టు 13 : పొలం డొంక విషయమై ఏర్పడ్డ ఘర్షణలో ఓ వ్యక్తిని తుపాకీతో కాల్చి చంపబోయాడన్న కేసులో నేరం రుజువు కావడంతో వేముల రూప్‌కుమార్ అనే నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు 1వ అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీనివాస్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... తోటపల్లి గూడూరు మండలం సౌత్ ఆములూరు గ్రామానికి చెందిన రంగినేని కిరణ్ అనే అతనికి అదే గ్రామంలోని పాముల దొరువు ప్రాంతంలో పొలం ఉంది. నెల్లూరు నగరం సరస్వతీ నగర్‌కు చెందిన వేముల చలపతి రావుకు కూడా అక్కడ పొలం ఉంది. పొలానికి వెళ్లే డొంక దారి విష యమై వీరి మధ్య గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రెండు వర్గాల మధ్య 2015 ఏప్రిల్ 1వ తేదీ గొడవ జరిగింది. ఆ సమయంలో చలపతిరావు ప్రోద్బలంతో ఆయన కుమా రుడు వేముల రూప్‌కుమార్ తుపాకీతో కాల్పులు జరిపాడు. తుపాకీ గుండు కిరణ్ ఎడమ మోచేతి నుంచి బయటకు వచ్చింది. రక్త గాయాలు కావడంతో కిరణ్ పరుగులు తీశాడు. అతన్ని కాపాడేందుకు వచ్చిన మామ కలవకట్ల సుధాకర్‌ను చలపతిరావు వర్గానికి చెందిన కొప్పోలు శిరీష్ గాయపరిచాడు. ఈ విషయం తెలిసి కిరణ్ బంధువులు అక్క డకు చేరుకోవడంతో నిందితులు పారిపోయారు. బాధితుల ఫిర్యాదుతో తోటపల్లి గూడూరు పోలీసులు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో వేముల రూప్ కుమార్‌పై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. మిగిలిన ఇద్దరిపై నేరం రుజువు కాకపోవడంతో వారిపై కేసు కొట్టివేశారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నారాయణమ్మ వాదించారు.



న్యాయాధికారి నియామకం

నెల్లూరు (లీగల్), ఆగస్టు 13 : జిల్లాలోని కోవూరు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్‌గా కర్నూలుకు చెందిన సాగిరే శివ నమ్రతను నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ స్థానంలో పనిచేస్తున్న జే కాత్యాయనిని కోవూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

వైద్య పరికరాల హామీ ఏమైంది?

'మాకు పెట్రోల్ బంకు నిర్వహణకు స్థలం ఇవ్వండి... ఇందుకు ప్రతిగా సుమారు రూ.70 లక్షల విలువైన వైద్య పరికరాలు ప్రభుత్వ ఆసుపత్రులకు అంద చేస్తాము' అంటూ గత కలెక్టర్ హరినారాయణన్ ఎదుట ఇండియన్ అయిల్ కార్పొరేషన్ నిర్వాహకులు హామీ ఇచ్చారు. దీంతో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్‌నాథ్‌ను కలెక్టర్ పిలిపించి ఆయా వైద్య పరికరాల ఏర్పాటుకు ఐవోసీఎల్ ప్రతినిధిని సంప్రదించాలని సూచించారు. ఇది జరిగి 5 నెల లైంది. పెట్రోలు బంకు కోసం స్థలం అయితే కేటాయించ రుగానీ ప్రభుత్వ ఆసుపత్రులకు వైద్య పరికరాలు మాత్రం ఇప్పటి వరకు అందలేదు.

- ● పెట్రోల్ బంకుకు స్థలం కోరిన ఐవోసీల్
- ● రూ.70 లక్షల వైద్య పరికరాల వితరణకు వాగ్దానం
- ● గత కలెక్టర్‌తో ఒప్పందం... నేటికీ అందని పరికరాలు
- ● స్పందించని ఐవోసీఎల్ ప్రతినిధులు



ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 13 : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిధిలో ఉన్న పాత క్షయ ఆసుపత్రి స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలని, దాని నుంచి వచ్చే ఆదాయంలో కొంత రెవెన్యూ అసోసియేషన్‌కు ఇవ్వాలని పూర్వ కలెక్టర్ హరినారాయణన్ భావించారు. రెవెన్యూ అసోసియేషన్ ఒత్తిడి మేరకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధితో చర్చించారు. జడ్పీ కార్యాలయం పక్కనే ప్రధాన రహదారిని ఆనుకుని పెట్రోల్ బంక్ కోసం 120 అంకణాల స్థలం కేటాయించారు. బహిరంగ మార్కెట్‌లో ఈ స్థలం విలువ రూ.5 కోట్లకు పైగా ఉం టుంది. అయితే నెలకు రూ.60 వేలు చెల్లించేలా 30 ఏళ్ల లీజుతో ఈ స్థలాన్ని పొందుతూ ఐవోసీ ఎల్ ఒపందం చేసుకుంది. లీజు ఫీజుల్లో 40 శాతం రెవెన్యూ అసోసియేషన్ వెల్ఫేర్‌కు చెందనుంది. అయితే ఇలాంటి విలువైన స్థలం ఓ పెట్రోల్ బంక్ నిర్వహణకు వేరే వారైతే నెలకు రూ.2 లక్షలు తీసుకుంటారని సమాచారం.

ఇప్పటికి నెలల గడిచాయి



ఆత్మకూరు ప్రభుత్వ వైద్య కళాశాల, కందుకూరు ఏరియా ఆసుపత్రి, 7 సామాజిక ఆరోగ్య కేంద్రాలకు ఇండియన్ అయిల్ కార్పొరేషన్ నిర్వాహకులు వైద్య పరికరాలు అందిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం రూ. 67.50 లక్షల విలువైన వైద్య పరికరాలు అందిస్తామన్నారు. గత కలెక్టర్ హరినారాయణ సమక్షంలోనే ఈ ఒప్పందం కుదిరింది. అయితే నేను ఫోన్ చేస్తున్నా సదరు నిర్వాహకులు ఫోన్ కూడా ఎత్తుకోవటం లేదు. ప్రస్తుత కలెక్టర్ ఆనంద్ దృష్టికి సమస్యను తీసుకుపోవాల్సి ఉంది.

- డాక్టర్ రమేష్‌నాథ్, డీసీహెచ్ఎస్ జిల్లా కో ఆర్డినేటర్



ఆత్మకూరు ఆసుపత్రికి ఇస్తామన్న టిఫా స్కాన్

కానీ, సదరు చమురు సంస్థ నిర్వాహకులు సేవా దృక్పథంతో ఆత్మకూరు జిల్లా ఆసుపత్రితో పాటు కందుకూరు, ఇతర సామాజిక ఆసుపత్రులకు దాదాపు రూ.70 లక్షల విలువ చేసే వైద్య పరికరాలు వితరణ ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో స్థలం కేటాయించారు. అయితే నేటికీ ఆయా ఆసుపత్రులకు ఒక్క వైద్య పరికరం కూడా అందించకపోవడం గమనార్హం.

పిల్లల పరీక్షలకు ఎంతో ఉపయోగం..

ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి టిఫా స్కాన్ వస్తే దాని వల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది. గర్భంలో చిన్నారులకు సంబంధించి అవయవ లోపాన్ని ఈ స్కానింగ్ పరికరం కనిపెడుతుంది. తద్వారా వైద్యులు తగిన చికిత్సలు అందించే వీలుంటుంది. ప్రస్తుతం ప్రతి 100 మంది గర్భిణులలో 10 మంది గర్భస్థ పిండంలో అవయవ లోపాలు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం టిఫా స్కాన్ నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మాత్రమే ఉంది. ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి కూడా ఇలాంటి పరికరం కేటాయిస్తే చుట్టు పక్కల ఎంతో మంది గర్భవతులకు ఉపయోగపడుతుంది. ఆత్మకూరు ఆసుపత్రికి టిఫా స్కాన్‌తో పాటు కందుకూరు ఏరియా ఆసుపత్రికి ఎలక్ట్రో హైడ్రాలిక్ ఆపరేటింగ్ టేబుల్, రాపూరు, ఉదయ గిరి, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట, కోవూరు, పొదలకూరు, ఉలవపాడు సామా జిక ఆసుపత్రులకు ఈసీజీ, ఎక్స్‌రే పరికరాలు అందిస్తానని ఐవోసీఎల్ నిర్వాహకులు హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు అడుగు ముందుకు వేయలేదు.

వీఎస్‌యూలో రీసెర్చ్ కోర్సులకు నోటిఫికేషన్

వెంకటాచలం, ఆగస్టు 13: కాకుటూరు సమీపంలోని విక్రమ సింహపురి యూనివర్శిటీలో యూజీ నాలుగేళ్ల ఆనర్స్ విత్ రీసెర్చ్ కోర్సులకు నోటిఫి కేషన్ విడుదల చేసినట్లు వర్శిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఎం హనుమారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్‌లు మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ తెలుగు, బీఏ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బీఎస్సీ, స్టాటిస్టిక్స్ కోర్సులకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఈ కోర్సుల్లో చేరదలచిన విద్యార్థులు ఈ నెల 13వ తేదీ నుండి 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు ఇతర వివరాలకు యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు. ఈ కోర్సుల్లో చేరు అర్హత గల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందన్నారు.

ఆన్‌లైన్ కోర్సులు

యూనివర్శిటీలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఆన్‌లైన్ కోర్సులను ప్రారంభించ డానికి అన్ని చర్యలు చేపడుతున్నట్లు వర్శిటీ వీసీ డాక్టర్ ఎస్ విజయభాస్కర్ రావు తెలిపారు. మంగళవారం ఆయన వివిధ విభాగాల హెచ్‌ఓడీలతో కలిసి యూనివ ర్శిటీలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిపాదనలు సిద్ధం చే యాలని సూచించారు. ఇందులో ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ తెలుగు, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్, ఎంకామ్, ఎంఏ పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్స్ కోర్సులకు ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ లెర్నింగ్ ద్వారా అందించేందుకు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. అనంతరం టీం లీప్స్ ఎడిట్ ప్రతినిధి వివేక్ వీసీని కలవగా కోర్సులను ప్రారంభించేందుకు కావాల్సిన టెక్నికల్ సపోర్ట్ అందిస్తామని హామీ ఇచ్చారు.

167 మిలియన్ కిలోల పొగాకుకు అనుమతి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర చైర్మన్ యశ్వంత్‌కుమార్

మర్రిపాడు, ఆగస్టు 13: డీసీపల్లి పొగాకు బోర్డును మంగళవారం రాష్ట్ర పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, వైస్ చైర్మన్ వాసుబాబు సందర్శించారు. ఈ సందర్భంగా బోర్డులోని రైతులతో వారు సమాశమయ్యారు. 2024 పంట కాలానికి 142మిలియన్ కిలోలకు పొగాకు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వగా రైతులు 200మిలియన్ కిలోల పొగాకు పండించినట్లు తెలిపారు. అనుమతి మించి పండించిన పొగాకును రైతులు అమ్ముకునేందుకు అపరాధ రుసుం లేకుండా బోర్డు అనుమతించినట్లు చెప్పారు. 2024-25లో పంట కాలానికి 167మిలియన్ కిలోలకు అనుమతించినట్లు, అందుకు ప్రతిరైతు ఈ ఏడాది 28నుండి బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రైతు సంక్షేమానికి కావాల్సిన అన్ని చర్యలను బోర్డు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి రాజశేఖర్, రైతుసంఘం నాయకులు నరసపనాయుడు, ఆరికట్ల జనార్దన్‌నాయుడు పాల్గొన్నారు.

అవయవ దాన ప్రాధాన్యతను గుర్తించాలి

● వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందు



అవయవ దాన దినోత్సవంలో వైద్యులు, వైద్య విద్యార్థులు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 13 : అవయవ దాన ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలని నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందు పిలుపునిచ్చారు. మంగళవారం అంతర్జాతీయ అవయదాన దినోత్సవం సందర్భంగా వైద్యులు, వైద్య విద్యార్థులు వైద్య కళాశాలలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ మరణానంతరం ప్రతి ఒక్కరు నేత్రదానం చేయాలన్నారు. అలాగే బ్రెయిన్ డెడ్ అయిన వారు, రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారు తప్పనిసరిగా అవయవ దానం చేయాలని కోరారు. ఎంతో మంది అవయవ దాతల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. సింహపురి దేహ సమర్పణ సంస్థ భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ సంస్థ జిల్లా అధ్యక్షురాలు విజయమ్మ, తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, వైద్య కళాశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కాలేషాబాషా, పినాకినీ ఆశ్రమ నిర్వాహకురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

రంగడి సేవలో ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రాజేష్ శర్మ

● వేదగిరి, జొన్నవాడలో పూజలు



నెల్లూరు : రంగనాథస్వామి ఆలయంలో రాజేష్‌శర్మకు స్వాగతం పలుకుతున్న ఆలయ ఈవో, తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం/బుచ్చిరెడ్డిపాళెం) ఆగస్టు 13 : నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామిని మంగళవారం సాయంత్రం ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రాజేష్‌శర్మ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ మర్యాదలు చేశారు. కాగా, రాజేష్‌శర్మ జొన్నవాడ, వేదగిరి క్షేత్రాలను కూడా సందర్శించారు. ఆలయ పాలక మండలి సభ్యులు, అధికారులు సాదర స్వాగతం పలికి పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు, వేద ఆశీర్వచనం అందజేశారు.

వసతే లేదు.. ఇంకేం చదువు?

- మూతపడిన ఉదయగిరి బీసీ, ఎస్సీ హాస్టళ్లు
- బాలికల వసతిగృహం మూసి వేసేందుకు చర్యలు
- చదువుకు దూరమవుతున్న విద్యార్థులు.. ఆందోళనలో తల్లిదండ్రులు



ఉదయగిరిలో మూతపడిన డీఎన్‌టీ బాయ్స్ హాస్టల్

ఉదయగిరి రూరల్, ఆగస్టు 13: పట్టణంలోని బీసీ,ఎస్సీ హాస్టళ్లు మూతపడగా తాజాగా విద్యార్థులు లేరనే నెపంతో ఇంటిగ్రేటెడ్ బాలికల వసతిగృహం సైతం మూసివేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. మెట్టప్రాంతంలో వలసలు అధికం. స్థానికంగా ఉండేవారు అధికశాతం మంది రోజువారి కూలీపనులు చేసే కుటుంబాన్ని పోషించేవారు. ఈ నేపథ్యంలో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించినా గ్రామాల నుంచి రోజు పాఠశాలలు, కళాశాలలకు పంపేందుకు ఆర్థికభారం అవుతుండడంతో తమ పిల్లలను మధ్యలోనే చదువులు మాన్పించేస్తున్నారు. వసతిగృహాలుంటే అక్కడే పిల్లలు విద్యనభ్యసించే అవకాశం ఉంది. ఇవి లేకపోవడంతో చాలామంది విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు.

విద్యార్థులు లేరన్న నెపంతో..: విద్యార్థులు లేరనేనెపంతో అధికారులు గత కొన్నేళ్ల కిందట పట్టణంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్స్‌ను మూసివేశారు. అదే తరహాలో గతేడాది డీఎన్‌టీ బీసీ బాయ్స్ హాస్టల్స్‌ను మూసివేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో స్థానిక పిల్లలే వసతిగృహాల్లో జాయిన్ అవుతుంటారు. ఆయా హాస్టల్స్‌లో లోకల్ విద్యార్థుల సంఖ్య అధికంగా ఉందనే అధికారులు హాస్టల్స్‌ను మూసివేయడం దారుణమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పలు వసతిగృహాల్లో విద్యార్థులు లేకపోయినా కొందరు వార్డెన్లు ప్రధానోపాధ్యాయులతో చేతులు కలిపి ఆ పాఠశాలలో విద్యార్థుల పేర్లను తమ హాస్టల్‌లో ఉంటున్నట్లు రికార్డులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆ హాస్టల్స్‌కు వర్తించని నిబంధనలు ఉదయగిరి హాస్టల్స్‌కు వర్తిస్తాయా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇలా చేస్తే పరిష్కారం: పట్టణంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు వ్యవసాయ కళాశాల ఉంది. ఆయా కళాశాలలకు దగ్గరలోనే డీఎన్‌టీ బాయ్స్ హాస్టల్ ఉంది. అధికారులు చొరవ తీసుకొని హాస్టల్‌ను ప్రారంభిస్తే ఇటు ఉన్నత పాఠశాల, అటు కళాశాల విద్యార్థులకు సౌకర్యంగా ఉండడంతో పాటు వసతి కష్టాలు తీరి సమస్య పరిష్కారమవుతుంది. గతంలో టీఎన్‌ఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ విద్యార్థి సంఘాలు ఉదయగిరిలో వసతిగృహాలు ప్రారంభించాలని ఆందోళనలు చేయడంతో పాటు అధికారులు, పాలకులకు వినతిపత్రాలు అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ సమస్యపై పట్టించుకున్న పాపానపోలేదు. కూటమి ప్రభుత్వమైనా ఉదయగిరిలో హాస్టల్స్‌ను పునః ప్రారంభించి వసతి కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి పథకాలకు గ్రహణం!

- రాళ్లపాడు ఆధారిత మంచినీటి పథకాల నుంచి కలుషిత నీరు సరఫరా
- కాంట్రాక్టరు, అధికారుల నిర్లక్ష్యం
- నిర్వహణ లోపంతో 114 గ్రామాల ప్రజలకు శాపం
- ఆందోళన చెందుతున్న గ్రామీణులు



రాళ్లపాడు రిజర్వాయరులో నిర్మించి ఉన్న గుడ్లూరు మంచినీటి పథకం ఇన్‌టేక్‌వెల్

కందుకూరు, ఆగస్టు 13 : నియోజకవర్గంలోని సింహభాగం గ్రామాలకు తాగునీరందిస్తున్న సీపీడబ్ల్యూ స్కీమ్‌ల నిర్వహణ అధ్వానంగా మారటంతో కలుషిత నీరు సరఫరా అవుతోంది. పేరుకు రక్షిత తాగునీటి పథకం అయినా కనీసం గృహావసరాలకు కూడా వాడుకోటానికి ఇబ్బంది పడే రీతిలో నీటి సరఫరా జరుగుతున్నది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నీరు దుర్వాసనతోపాటు కలుషితమై రంగుమారి వస్తున్నాయి. దీంతో స్నానాలు, ఇతర కార్యక్రమాలకు ఈ నీటిని వాడుకోవాలన్నా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేగాక ఈ నీటిని వినియోగిస్తే శరీరంపై దురద, సన్నటికురుపులు కూడా వస్తున్నాయని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటం, ఈ స్కీంల నిర్వహణ చూస్తున్న కాంట్రాక్టర్ జలశుద్ధి ప్రక్రియను పాటించకుండా, రాళ్లపాడు రిజర్వాయరులోని నీటిని యథాతథంగా సరఫరా చేస్తుండటమే ఈ దుస్థితికి కారణమనేది సుస్పష్టం. ఎంతోకాలంగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా చుండి-చెర్లోపాలెం మంచినీటి పథకం, రాళ్లపాడు-రేళ్లపాడు మంచినీటి పథకం, గుడ్లూరు ఫేస్-1, ఫేస్-2 మంచినీటి పథకాల నుంచి సరఫరా అయ్యే మంచినీరు పచ్చగా, మడ్డిగా వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ నాలుగు మంచినీటి పథకాల నుంచి లింగసముద్రం, వలేటివారిపాలెం, గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లోని సుమారు 114 గ్రామాల ప్రజలకు నీరు సరఫరా అవుతోంది. ఈ పథకాలను నిర్వహించే కాంట్రాక్టరు పెద్దగా ఈ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.గత జూన్‌లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోపాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు ఈ మంచినీటి పథకాల నిర్వహణకు టెండర్లు పిలిచారు. దీంతో కాంట్రాక్టరు వీటి నిర్వహణను వదిలేశారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం ప్రాజెక్టులో కూడా కేవలం ఏడు అడుగుల నీటిమట్టం ఉంది. ఇందులోని నీరు కూడా పచ్చగా ఉంటోంది.సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రెండవరోజు క్షేత్రస్థాయిలో అవగాహన

సంగం, ఆగస్టు 13: సర్పంచులు, కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణ రెండోరోజుకు చేరింది. మంగళవారం కోలగట్ల చెత్త సంపద కేంద్రంలో నిర్వహణపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈవోఆర్డీ అప్పాజీ ఆధ్వర్యంలో సర్పంచులు, కార్యదర్శులు బృందంగా కోలగట్లకు వెళ్లి చెత్త సంపద కేంద్రంలో తడి, పొడిచెత్త, వర్మికంపోస్టు గురించి అవగాహన కల్పించారు.

ఉదయగిరి రూరల్: గండిపాళెం చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో సర్పంచులు, కార్యదర్శులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు కేంద్రం నిర్వహణపై అవగాహన కల్పించారు. ఇంటింటా సేకరించిన తడి, పొడి చెత్తను కేంద్రానికి తరలించాలన్నారు. కేంద్రంలో నిర్మించిన తొట్లలో వర్మీకంపోస్టు ఎరువు తయారీకి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జున, కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, కరీముల్లా, నాగూర్‌బీ, చంద్రశేఖర్, ఖాదర్‌కరీముల్లా పాల్గొన్నారు.

సీతారామపురం: ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ భార్గవిలు సర్పంచులు, కార్యదర్శులకు చెత్తను ఏవిధంగా సేకరించాలి, సంపద ఎలా తయారు చేయాలి, ఉత్పత్తి చేసిన సేంద్రీయ ఎరువుతో పంటలకు కలుగు ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు, భాగ్యకుమారి, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: వేంపాడు చెత్త సంపద తయారీ కేంద్ర ప్రాంగణంలో డీఎల్పీవో కృష్ణమోహన్, ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి మాట్లాడారు. అన్ని పంచాయతీల్లోను కేం ద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి పంచాయతీల అభివృద్ధికి సంపదను సమకూర్చుకోవాలన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలి

వింజమూరు, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవంరోజు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుల్లాల్లా నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వివేకానంద స్కూల్ నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు డేగ మధుయాదవ్, మద్దూర్ గోపాల్‌రెడ్డి, అర్వి కృష్ణారెడ్డి, మెంటా రమేష్ పాల్గొన్నారు.

గుండెపోటుతో హాస్టల్ వార్డెన్ అంకయ్య మృతి

మర్రిపాడు, ఆగస్టు 13: కంపసముద్రం ఎస్సీ హాస్టల్ వార్డెన్ ఎం.అంకయ్య మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం మర్రిపాడులోని ఇంటి నుండి కంపసముద్రం హాస్టల్‌కు బైక్‌పై వెళ్తుండగా పెగళ్లపాడు సమీపంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బైక్‌ను పక్కన ఆపి సొమ్మసిల్లి ప్రాణాలు వదిలినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అర్హులందరికీ సీసీఆర్సీ కార్డులు : ఆర్డీఓ



వ్యవసాయశాఖ అధికారులతో సమావేశమైన ఆర్డీఓ మధులత

ఆత్మకూరు, ఆగస్టు 13: అర్హులైన కౌలు రైతులందరికీ సీసీఆర్సీ కార్డులను అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో మధులత తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయశాఖ అధికారులతో సమావేశమై పలుఅంశాలపై చర్చించారు. కౌలురైతుల కార్డులతో భూ యజమానులకు ఇబ్బందులు ఉండవని అవగాహన కల్పించాలన్నారు. కార్డులు కాలపరిమితి ముగిసిన వారికి పునరుద్ధరించేలా చూడాలని సూచించారు. ఈ- క్రాప్ నమోదును వేగవంతం చేయాలని ఆదేశించారు.

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవం

చేజర్ల, ఆగస్టు 13: నాగులవెల్లటూరులోని వెంకయ్యస్వామి ఆశ్రమంలో మూడురోజులుగా నిర్వహిం చిన భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు మంగళ వారం ముగిశాయి. చివరి రోజు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి భక్తులకు అన్నదానం చేసి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి గ్రామోత్స వాన్ని నిర్వహించారు. అన్నదాన దాతలుగా వేలూరు కిష్టయ నాయుడు దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆశ్రమ చైర్మన్ వేలూరు కేశవచౌదరి, వైస్ చైర్మన్ చావా ఇందుశేఖర్ నాయుడు, వేలూరు నారాయణ నాయుడు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు, ఆగస్టు 13: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10-30 గంటలకు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరవుతారన్నారు. అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు

ప్రైవేట్ స్కూల్ వాహనాల తనిఖీ



వాహనాన్ని తపనిఖీ చేస్తున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు, ఆగస్టు 13: ఫిట్‌నెస్ లేకుండా స్కూల్ బస్సులు నడుపుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు హెచ్చరించారు. జిల్లా డీటీసీ ఆదేశాల మేరకు మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్కూల్ వాహనాలను ఎంవీఐ శ్రీరాములు స్వయంగా నడిపి పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. అతివేగంగా వాహనాలు నడపకూడదని డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. 18ఏళ్లు నిండిన వారు డ్రైవింగ్‌లైసెన్సు తీసుకుని వాహనాలను నడపాలన్నారు. తనిఖీల సమయంలో డ్రైవింగ్ లైసెన్సు లేకుంటే చర్యలు తప్పవన్నారు.

మాదక ద్రవ్యాలు వాడొద్దు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 13: విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, వాటికి దూరంగా ఉండి భవిష్యతుకు బంగారుబాటలు వేసుకోవాలని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఏ.నరసింహులు అధ్యక్షతన నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు విక్రయించినా, సేవించినా చర్యలు తప్పవన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ షేక్ అన్వార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకటసుబ్బయ్య, ఐక్యూ ఏసీ కేసీ విక్రమ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి

రచయిత పైడిమర్రికి నివాళి

అనంతసాగరం, ఆగస్టు 13: చిలకలమర్రి ఉన్నత పాఠశాల, అనంతసాగరం శాఖ గ్రంథాలయంలో మంగళవారం దేశం నా మాతృభూమి రచయిత పైడిమర్రి వెంకటసుబ్బారావు వర్ధంతిని నిర్వహించారు. విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, గ్రంథాలయాధికారి నారాయణరావు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

ఆత్మకూరు, ఆగస్టు 13: మున్సిపాలిటీలోని 28వార్డు సయ్యద్ అన్వర్‌బాష, 2వ వార్డు శానంపూడి ఓబమ్మ, 23వార్డులో గంగవరపు చౌడయ్యలు మరణించాడు. వారి కుటుంబాల సభ్యులను మంగళ వారం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి పరామర్శించారు. ఒక్కొ కుటుంబానికి రూ.10వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్): విద్యార్థిదశ నుంచే కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి అంజయ్య చెప్పారు. జిల్లా న్యాయస్థానం సూచన మేరకు మంగళవారం నందిపాడు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. చిన్నతనం నుంచే మంచి నడవడిక, ప్రవర్తన అలవర్చుకోవాలన్నారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు చెప్పే అంశాన్ని క్షుణ్ణంగా వినాలన్నారు. అనంతరం వంటగదిని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉమా శంకర్, ప్రిన్సిపాల్ అంజలీదేవి, న్యాయవాది సందిరెడ్డి రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి అంజయ్య

అన్న పెళ్లి కోసం వచ్చి...

- మోటారుబైకు అదుపుతప్పి పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు



పృథ్వీచంద్ర మృతదేహం


వలేటివారిపాలెం, ఆగస్టు 13 : అన్న పెళ్లికి వచ్చిన తమ్ముడు రెండు రోజుల్లో వివాహ వేడుకలు జరగనుండగా ఇంతలో రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం చెందాడు. దీంతో పెళ్లింటి విషాదం నెలకొంది. వివరాల మేరకు.. కందుకూరు పట్టణంలోని కోటారెడ్డి నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు ముల్లూరి మల్లికార్జున, ప్రమీలారాణి దంపతుల కుమారుడు ముల్లూరి పృథ్వీచంద్ర (27) హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 15వ తేదీ ఆయన అన్నకు వివాహం జరగనుండ డంతో పృథ్వీచంద్ర స్వగ్రామానికి వచ్చాడు. ఈ నేపథ్యంలో వలేటివారి పాలెం మండలం అత్తింటివారిపాలెంలో జరుగుతున్న పోలేరమ్మ తిరునాళ్లకు వెళ్లేందుకు కోటారెడ్డి నగర్‌కు చెందిన ఉన్నం వెంకటరాంభూల్ చౌదరితో కలిసి సోమవారం అర్ధరాత్రి మోటారు బైకుపై బయలుదేరారు. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ నేప థ్యంలో మార్గమధ్యంలో మండలంలోని కాకుటూరు గ్రామ సమీపంలోని హెరిటేజ్ డెయిరీ, ఐటీఐ కాలేజీ మధ్యలో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోకి దిగి పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పృథ్వీచంద్ర తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న వెంకటరాంభూలచౌదరికీ తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ బాలమహేంద్రనాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ముల్లూరి మల్లికార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కందుకూరులో విషాదం

కందుకూరు : సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ముల్లూరి పృథ్వీచంద్ర రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో కందుకూరు పట్టణంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. పృథ్వీచంద్ర అన్నయ్యకు ఈనెల 15న వివాహం జరగనుండడంతో వివాహానికి ఏర్పాట్లన్నీ పూర్తి చేసుకున్న తరుణంలో ఈ ఘటన జరగడంతో దిగ్భ్రాంతి చెందిన వారి బంధువులు, స్నేహితులు, సహచర ఉపాధ్యాయ మిత్రులు పెద్దసంఖ్యలో మృతదేహాన్ని సందర్శించి మల్లికార్జున, ప్రమీలారాణి దంపతులను ఓదార్చారు. అలాగే ముల్లూరి పృథ్వీచంద్ర మృతదేహాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య తదితరులున్నారు.

అమృత్ పైలాన్ కూల్చిన చోట 100 అడుగుల జెండా

- కావలిలో రేపు ప్రారంభోత్సవం



ప్రారంభానికి సిద్ధమైన కావలి ఐకాన్

కావలి, ఆగస్టు 13: కావలి పట్టణానికి తాగునీటి సరఫరా కోసం అమృత్ పథకం కింద కేంద్రంనిధులు మంజూరు చేయగా ఆ నిధులకు చిహ్నంగా నిర్మించిన అమృత్ పైలాన్‌ను వైసీపీ ప్రభుత్వంలో రాత్రికి రాత్రి అప్పటి ఎమ్మెల్యే సహకారంతో కూల్చివేసి తెల్లారేసరికి దా ని నామరూపాలు లేకుండా చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పైలాన్ కూల్చిన ప్రదేశంలో కావలికి గుర్తుండే విధంగా 100 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను స్వీయ నిధులతో ఏర్పాటు చేశారు. అక్కడే ఎదురుగా నందమూరి తారక రామారావు, మహాత్మాగాంధీల ఫొటోలు, జాతీయనాయకుల ఫొటోలు, మరో పక్క ఇప్పటి వరకు కావలి ఎమ్మెల్యేలుగా కొనసాగిన వారి ఫొటోలను ఏర్పాటు చేశా రు. కలర్‌ఫుల్ లైటింగ్ జెండా స్తంభానికి వెనుక వాటర్ పాల్, దాని ముందు ఐలవ్ కావలి అక్షరాలు ఏర్పాటు చేశారు. కావలికి వచ్చిన ప్రజలు అక్కడకు వచ్చి ఆహ్లాదకరమైన ఆ వాతావరణాన్ని సందర్శించి సెల్ఫీ తీసుకునే విధంగా తీర్చి దిద్దారు. ఆగస్టు 15న దానిని సుమారు 10,000 మంది విద్యార్థులతో కలిసి ప్రారంభించనున్నారు. ఇది కావలికి ఒక ఐకానిక్‌గా నిలవనుండటంతో కావలి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలి



నారా లోకేష్‌తో పువ్వాడి మౌనిక

కందుకూరు, ఆగస్టు 13: కందుకూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని నియోజకవర్గ తెలుగు ప్రొఫెషనల్ వింగ్స్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక ఐటీ శాఖామంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం పలువురు ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధులతో వెళ్లి మంగళగిరిలో నారా లోకేష్‌ను కలిశారు. ఆమె వెంట ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధులు మందలపు నాగేశ్వరరావు తదితరులున్నారు.

వేళాంగిణి మాలధారుల పాదయాత్ర



వేళాంగిణికి బయలుదేరిన మాలధారులు

బిట్రగుంట, ఆగస్టు 13: ఈనెల 29న వేళాంగిణిలో జరిగే వేళాంగిణి మాత జెండా పండుగకు పాదయాత్రతో చేరుకుంటామని వేళాంగిణి మాలధారులు తెలిపారు. బోగోలు అంతోణివారి వీధికి చెందిన వేళాంగణిమాత మాలధారులు మంగళవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక ప్రార్థనల అనపంతరం పాదయాత్ర ప్రారంభించారు. 680 కిలోమీటర్ల పాదయాత్ర 16 రోజుల్లో పూర్తి చేసుకుని వేళాంగణి చేరుకుని అక్కడ జరిగే వేళాంగణిమాత జన్మదిన జెండా పండగలో పాల్గొంటామన్నారు. పాదయాత్రికులకు సంఘీభావంగా శివమాల ధారణ భక్తుడు బీ.రవిచంద్ర బిస్కెట్ పాకెట్లను అందచేశారు.

చెత్తతో సంపద.. పంచాయతీలకు లాభం



చెత్తతో సంపదపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కలిగిరి, ఆగస్టు 13: చెత్త నుంచి సంపద కేంద్రాలు పంచాయతీలకు ఆదాయవనరులని ఎంపీడీవో రంగసుబ్బరాయుడు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం నాగసముద్రం పంచాయతీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పనితీరును పరిశీలించారు. గ్రామంలో తడి, పొడ చెత్తలను వేర్వేరుగా సేకరించి తద్వారా వర్మికంపోస్టు ఎరువు తయారీ, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి వెలుగోటి మధు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి

కావలిటౌన్, ఆగస్టు 13: బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని వీహెచ్‌పీ కావలి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పుటూరి కొండపనాయుడు, ఇంటూరు రమణయ్యలు పేర్కొన్నారు. మంగళవారం ముసునూరులోని హనుమత్ క్షేత్రంలో వీహెచ్‌పీ సమావేశం జరిగింది. వక్తలు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ప్రధాని దేశం విడిచిపెట్టి వెళ్లిపోయిన తరువాత అరాచక శక్తులు పేట్రేగిపోతున్నాయని, హిందు ఆలయాలను ధ్వంసం చేశారని, హిందువులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు, కోశాధికారి ఆర్‌వీ కృష్ణయ్య, సభ్యులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

కావలి రూరల్, ఆగస్టు 13: భార్యాభర్తల కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తపై బంధువులతో కలసి దాడి చేసిన ఘటనలో పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. కావలి 1వ పట్టణ ఎస్ఐ జమాల్‌వలి కథనం మేరకు.. బాపట్ల జిల్లా జె.పంగులూరుకు చెందిన దేవరకొండ చిరంజీవి, గుడ్లూరు మండలం ఏలూరుపాడుకు చెందిన కళ్యాణి భార్యాభర్తలు. వీరు మనస్పర్థలతో గత కొంతకాలంగా కళ్యాణి పుట్టింట్లో, చిరంజీవి తన కుమారైతో కలసి జె.పంగులూరులో వేర్వేరుగా ఉంటున్నారు. కావలిలో చదువుకున్న కుమార్తె టీసీ కోసం చిరంజీవి గత నెల 26వ తేదీన కావలికి వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య, ఆమె బంధువులు 10మందితో కలసి కావలికి వచ్చి అతనిపై దాడి చేశారు. అక్కడ నుంచి ఏలూరుపాడు తీసుకువెళ్లి కొట్టారు. ఈ మేరకు బాధితుడు గత వారం పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. దీనిపై కావలి 1వ పట్టణ ఎస్ఐ జమాల్‌వలి విచారణ చేపట్టి ఇరంజీవి భార్య కళ్యాణితో పాటు ఆమె కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

కావలి, ఆగస్టు 13: టిడ్కో గృహ సముదాయంలో ప్రతి నెలా ఉచిత వైద్యశిబిరం నిర్వహించాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మద్దూరుపాడులోని టిడ్కో గృహ సముదాయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గృహ సముదాయాలకు ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్న కావలి టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్ ఆధ్వర్యంలో వైకుంఠపురంకు చెందిన అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్లు

బిట్రగుంట, ఆగస్టు 13: బోగోలు మండలం ముంగమూరు పంచాయతీ పేటగ్రామంలో వెలసి ఉన్న పోలేరమ్మ ఆలయ వార్షకోత్సవం సందర్భంగా మంగళవారం పొంగళ్ల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం అమ్మవారి సన్నిధజిలో సద్దిపోసే కార్యక్రమం అనంతరం గ్రామస్థులు మేళతాళాలతో పొంగళ్లను తీసుకొచ్చి నైవేద్యం సమర్పించారు. రాత్రి పోలేరమ్మ గ్రామోత్సవంతో పాటు గంగపెట్టి, బొల్లిఆవులు, వీరతాళ్ల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన

కావలి, ఆగస్టు 13: మండలంలోని ఒట్టూరు మోడల్ స్కూల్‌లో మంగళవారం కావలి రోటరీక్లబ్, రెడ్‌క్రాస్‌ల ఆధ్వర్యంలో అవయవదాన దినోత్సవంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో 400 మంది విద్యార్థులకు ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు, అగర్వాల్ ఐ క్లినిక్ సహకారంతో కంటి చూపు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. ఇందిర అనీల్ కుమారి, ఎన్‌సీసీ అధికారి సీహెచ్ జయరాం, రోటరీక్లబ్ కావలిశాఖ అధ్యక్షురాలు స్వర్ణలత, కార్యదర్శి సలీంబేగ్, సభ్యులు డాక్టర్ కే. మాధవరెడ్డి, చెన్నంశెట్టి దినేష్, రెడ్‌క్రాస్ సిబ్బంది పద్మావతి, శేషమ్మ, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌ఆర్‌లో నషా ముక్తిభారత్ కార్యక్రమం

కందుకూరు, ఆగస్టు 13: స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నషా ముక్తిభారత్ కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు అవగాహన కల్పించటం కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ మాట్లాడుతూ సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం పెరగటం ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టరు డి.రామాంజనేయులు, డాక్టరు పి.రాజగోపాల్, కె.నరేష్‌రాజా, కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో సుబ్బారావు బాధ్యతల స్వీకరణ

బిట్రగుంట, ఆగస్టు 13: బోగోలు మండల ఎంపీడీవోగా ఏవీ సుబ్బారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో బదిలీపై వెళ్లి తిరిగి వచ్చిన ఎంపీడీవోను ఏవో గోవిందరావు, ఈవోపీఆర్డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

● స్పీడ్ బ్రేకర్, సూచక బోర్డుల కరువు



చవటపాళెం సమీపంలోని ప్రమాదకర మలుపు

వెంకటాచలం, ఆగస్టు 13: మండలంలోని వెంకటాచలం- కసుమూరు రోడ్డు, అప్పయ్యకండ్రిగ- చవటపాళెం రోడ్డు, పుంజులూరుపాడు - తిరుమలమ్మపాళెం రోడ్డు, కందలపాడు రోడ్డు, కసుమూరు - కురిచెర్లపాడు రోడ్డు, కసుమూరు - పాలిచెర్లపాడు రోడ్డు, తిక్కవరప్పాడు- గొట్లపాళెం మీదగా గొలగమూడి రోడ్డు, ఇడిమేపల్లి- ఈదగాలి రోడ్డు, కంటేపల్లి - గొలగమూడి మీదగా అనికేపల్లికి వెళ్లే రోడ్లపై ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో తరచుగా ప్రమాదాలు జరిగి కొందరు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు క్షతగాత్రులవుతున్నారు.

● కురిచెర్లపాడు వీవర్స్ కాలనీ మలుపులో నాలుగేళ్ల క్రితం ముగ్గురు వ్యక్తులు ఒకే రోజు మృతి చెందారు. అదే విధంగా పలు ప్రమాదాల్లో అధిక సంఖ్యలో గాయపడ్డారు.

● కసుపూరు గ్రామానికి 100మీటర్ల దూరంలోనే మూడు మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద కూడా పలువురు తమ ప్రాణాలను పోగొట్టుకున్నారు. ఆటోలు బోల్తా పడడం, గాయపడడం వంటి సంఘటనలకు లెక్కలు లేవు. ఈ మలుపుల వద్ద స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయడం, సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తే ఈ ప్రమాదాలను నివారించే అవకాశముంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మరిన్ని ప్రాణాలు పోక ముందే చర్యలు తీసుకోవాలి



రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించడమే కాకుండా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం, టీవీల్లో, దిన పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడంతో ప్రమాదాలు నివారించబడవు. అధికారులు ఏ రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నాయి, ఎలాంటి చర్యలు చేపడితే ప్రమాదాలను నివారించవచ్చు అనే అంశాలపై అధ్యయనం చేయాలి. తద్వారా ప్రమాదాలు తగ్గుతాయనే సంగతి అధికారులు గుర్తించాల్సి ఉంది.

- వల్లూరు రమేష్ నాయుడు, పాలిచెర్లపాడు

నేడు ఎమ్మెల్యే రాక

మనుబోలు, ఆగస్టు 13: మండల కేంద్రానికి బుధవారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రానున్నట్లు టీడీపీ జిల్లా నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య మంగళవారం తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాలలో, హైస్కూల్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని చెప్పారు.

21న భారత్ బంద్

విడవలూరు, ఆగస్టు 13: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి స్వార్థం కోసం చేసిన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 21న దేశవ్యాప్తంగా భారత్ బంద్ చేపడుతున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ నాయకులు ఎల్లు సాల్మన్ రాజు తెలిపారు. విడవలూరులో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచ్ఛిన్నం చేసేందుకు ఎస్సీ వర్గీకరణను తెరమీదకు తీసుకువచ్చాయన్నారు. దీనివలన మాల, మాదిగలకు ఉన్న ఐక్యత దెబ్బతింటుందన్నారు. ఎస్సీ వర్గీకరణ వలన మాలలకు అన్యాయం జరుగుతుందని, వారికి వచ్చే ఫలాలు రాకుండా పోతాయన్నారు. ఈ క్రమంలో భారత్ బంద్‌లో మాలలందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సిమెంట్ బ్రిక్స్ తయారీ కేంద్రానికి నోటీసులు

బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలోని కట్టుబడిపాళెంలో ప్రభుత్వ లేఔట్ 2లోని పబ్లిక్ స్థలంలో సిమెంట్ బ్రిక్స్, యంత్రాలను 48 గంటల్లో ఖాళీ చేయాలని కమిషనర్ వెంకట రమణబాబు తయారీదారులకు మంగళవారం నోటీసులు జారీ చేశారు. లేఔట్లోని పబ్లిక్ స్థలాన్ని ఆక్రమించి సిమెంట్ బ్రిక్స్ తయారు చేస్తున్నారని కలెక్టర్, పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు పరిశీలించి బ్రిక్స్ తయారీదారులు హేమలతకు నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ తెలిపారు.

గాంధీ విగ్రహానికి జలాభిషేకం

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిలోని జాతీయ రహదారిపై ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి బీజేపీ నాయకులు మంగళవారం జలాభిషేకం చేశారు. బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగాలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర పంచాయతీ అధ్యక్షుడు రామిశెట్టి మోహన్‌బాబు, మిడతల రమేష్, కాసా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు సర్పంచుల డుమ్మా

మనుబోల : పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు రెండో రోజు సర్పంచులు డుమ్మా కొట్టారు. మండలంలో 19 పంచాయతీలు ఉంటే ఒక్క మనుబోలు సర్పంచు మినహా ఎవరూ హాజరుకాలేదు. మంగళవారం మనుబోలు చెత్తసంపద కేంద్రంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. కేవలం కార్యదర్శులు మాత్రమే హాజరయ్యారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ జీవీఎస్‌వీ ప్రసాద్, సర్పంచు కంచి పద్మమ్మ పాల్గొన్నారు.

కామాక్షితాయికి కాత్యాయని వ్రతం

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడ ఆలయంలో శ్రావణ మాసం 2వ మంగళవారం సందర్భంగా కామాక్షితాయికి ఆలయ పండితులు, పురోహితులు, అర్చకులు సామూహిక కాత్యాయిని వ్రతం నిర్వహించారు. ఈ పూజలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కైలాస వాహనాలు, ఫ్రీజర్ల కోసం వినతి

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలో మృతుల కైలాస వైకుంఠ అంతిమయాత్ర కోసం ప్రజలకు ఉపయోగపడేలా 2 వాహనాలు, 4 ఫ్రీజర్లు ఏర్పాటు చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి విన్నవించారు. ఈ మేరకు మంగళవారం గ్రామానికి చెందిన ఆత్మకూరు బాబురావు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థుల ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం : పట్టణంలోని బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు చేపట్టిన హర్ ఘర్ తిరంగ ర్యాలీని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కే.ప్రసన్నలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దిలీప్‌కుమార్, హైస్కూలు హెచ్ఎం సుజాత, జిల్లా రిసోర్సు సభ్యులు గండికోట సుధీర్‌కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే ప్రతి ఇంటిపైన జాతీయ జెండా ఎగురవేయాలని కోరుతూ గోపాలకృష్ణయ్య స్కూలు విద్యార్థులు మంగళవారం బుచ్చిలో జాతీయజెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్.శ్రీధర్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ పనులు చేయకుండా

రూ.200కోట్లు స్వాహా!

● సర్వేపల్లిలో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న అవినీతి, అక్రమాలు

● కాకాణి బాగోతంపై ధ్వజమెత్తిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



కాకాణి అవినీతి బాగోతాన్ని చదువుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, ఆగస్టు 13: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఇరిగేషన్ పనులు చేయకుండానే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అతని అనుచరులు రూ.200 కోట్లకు పైగా స్వాహా చేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం సాయంత్రం ఇడిమేపల్లి, ఈదగాలి గ్రామాల్లో రైతులతో కలిసి ఇరిగేషన్ కాలువలు, చెరువులను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. కాకాణి అవినీతి బాగోతాన్ని ఆధారాలతో సహా మీడియా ముందు పెట్టారు. పనులు చేసినట్లు బిల్లులు చేసుకున్న జాబితాను చదువుతుంటే రైతులు విస్తుపోయారు. ఇప్పటికే ఇరిగేషన్ అవినీతి, అక్రమాలపై సీఎం చంద్రబాబుకి ఫిర్యాదు చేసి విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు వెల్లడించారు. ఒకే పనిని ఎఫ్‌డీఆర్, జనరల్ ఫండ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఓఅండ్ఎం కింద చేసినట్లు చూపి నిధుల స్వాహా చేశారన్నారు. ఒక్క షట్టర్ల (చెక్కలు) మార్పిడి పేరుతోనే రూ.8కోట్లు దోపిడీ చేశారని మండిపడ్డారు. ఒక్క రూపాయి జీఎస్టీ కట్టకుండానే షట్టర్ల కోసం 300టన్నుల ఇనుము కొనుగోలు ఎలా చేశారని ప్రశ్నించారు. ఇనుము కొనిందీ లేదు.. షట్టర్లు బిగించిందీ లేదని కాకాణిపై ధ్వజమెత్తారు. రైతులు సొంతంగా చేసుకున్న పనులకు కూడా బిల్లులు చేసుకోవడం దారుణమన్నారు. కాలువల్లో నిండా నీళ్లు పారే సమయంలో పనులు చేసినట్టు చూపడం దోపిడీకి పరాకాష్ట అన్నారు. రైతులకు ద్రోహం చేసిన వారు మూల్యం చెల్లించు కోకతప్పదన్నారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి పొలాల్లో క్షేత్ర సందర్శన

ఇందుకూరు పేట, ఆగస్టు 13 : జగదేవిపేటలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ.రాజకుమార్ మంగళ వారం వరి పొలాలను క్షేత్ర సందర్శనం చేశారు. రైతుల పొలాలలో కాండం తొలుచు పురుగు, ఆకు ముడత తెగులను గుర్తించారు. ఆయన మాట్లాడుతూ కాండం తొలుచు పురుగు వరి పంటలో మూడు దశలలో నారుమడి, పిలక, కంకి దశలలో సంక్రమిస్తుందని తెలిపారు. పురుగులను గుర్తించి తక్షణం నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు చేరిన చెత్తబుట్టలు



మనుబోలు, ఆగస్టు 13: ప్రభుత్వం ఇచ్చిన చెత్తబుట్టలు మండల కేంద్రాల నుంచి మంగళ వారం ఎట్టకేలకు పంచాయతీలకు చేరాయి. మార్చిలోనే ఈ చెట్టబుట్టలు వచ్చాయి. బుట్టలకు నీలం, పచ్చ రంగులు ఉండడంతో ఎన్నికల కోడ్ నిబంధనలతో అప్పుడు పంపిణీ నిలిపి వేశారు. డీపీవో ఆదేశాలతో మండలంకు వచ్చిన 15వేల572 బుట్టలను పంచాయతీలకు పంపిస్తున్నట్లు ఈవోఆర్‌డీ జీవీఎస్‌వి ప్రసాద్ తెలిపారు.

మహాలక్ష్మమ్మకు సద్ది మహోత్సవం

కొడవలూరు : నార్తురాజుపాళెంలో మహాలక్ష్మి అమ్మవారికి సద్ది మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి సద్ది సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మందిపాటి ప్రవీణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మూడు వారాల పాటు ఈ జరిగే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, మందిపాటి రమణారెడ్డి, దీలీప్ కుమార్‌రెడ్డి, యోగానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన



కొమ్మిపాడులో సంపద కేంద్రాన్ని సందర్శించిన ఎంపీడీవో, సర్పంచులు

సైదాపురం, ఆగస్టు 13: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులను నిర్వహిస్తున్న రెండోరోజు శిక్షణ తరగతుల్లో మంగళవారం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ మాట్లాడారు. నివాసగృహాల నుంచి తడి చెత్త, పొడి చెత్తలను వేరుచేసి ఎస్‌డబ్ల్యూ పీసీలకు క్లాప్ మిత్రులు ట్రై సైకిల్ ద్వారా తరలించాలన్నారు. చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చి సంపదగా తయారు చేయడంతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని చెప్పారు. శిక్షణ అనంతరం కొమ్మిపాడులోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను సందర్శించారు.

పార్టీలకతీతంగా ప్రజా సమస్యల పరిష్కారం

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



విద్యార్థులకు బ్యాగ్‌లు, యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

విడవలూరు, ఆగస్టు 13: పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తున్నానని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ సౌందర్య అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ వైసీసీ పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. విద్యా, గ్రామీణ వ్యవస్థలను గాడిన పెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబానాయుడు అడుగులు వేస్తున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను తీర్చేందుకు పాటుపడాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దారు చంద్రశేఖర్, జడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, తదితర అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అంతకముందు స్థానిక డిగ్రీ కళాశాలను సందర్శించిన ఆమె కళాశాలలో వసతులను పరిశీలించారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య, నాయకులు పాశం శ్రీహరి రెడ్డి, రామిరెడ్డి విజయభానురెడ్డి, మాతూరు శ్రీనివాసులు రెడ్డి, చెముకుల శ్రీనివాసులు, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, అడపాల శ్రీధర్‌రెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, పురంధర్‌రెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

కనక దుర్గమ్మకు లక్ష కుంకుమార్చన



నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 13 : నగరంలోని స్టోన్‌హౌస్ పేట వాసవీ కన్యకా పర మేశ్వరి ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా కనక దుర్గమ్మకు లక్ష కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో జరిగింది. అమ్మవారికి ఉదయం అభిషేకాలు, విశేష పూజలు, మూలవరులకు విశేష అలంకారం జరిగాయి. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూలంగిసేవ జరిగింది. రాత్రి 108 మంది మహిళలకు పసుపు కుంకుమ పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కోట గురుబ్రహ్మం, ధర్మకర్తలు పర్యవేక్షించారు.

● నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో సాయంత్రం కాత్యాయని వ్రతం జరిగింది. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, నవావరణ పూజ జరిగాయి. చైర్మన్ రత్నం జయరామ్, ఆలయ ఈవో సహాయ కమిషనర్ బీ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకుడు రఘురామశర్మ పర్యవేక్షించారు.

విద్యార్థినుల ర్యాలీ



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

నెల్లూరు (విద్య), ఆగస్టు 13 : విద్యార్థులు సెల్‌ఫోన్స్ వినియోగిస్తే కలిగే పరిణామాలపై నగరంలోని కస్తూరి దేవి బాలికోన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏ ట్రస్ట్ ఏ ఫర్ ఆల్, కొండూరు హరినారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు అలహరి వెంకటేష్ మాట్లాడుతూ మొబైల్స్ వినియోగం కొన్ని విషయాలకే మంచిదే అయినా అనేక చెడు పరిణామాలకు దారి తీస్తుందని తెలిపారు. విద్యార్థులు మొబైల్స్ వినియోగించకుండా తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. సెల్‌ఫోన్స్ వినియోగిస్తే విద్యలో వెనుకపడడంతోపాటు చెడు ప్రభావాలకు లోనవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వనజ, కార్యక్రమ నిర్వాహకులు శింగంశెట్టి మురళి, ముత్యాల రవీంద్ర, బుజ్జయ్య, శ్రీమంత్ పాల్గొన్నారు.

రూరల్ అభివృద్ధికి చేయూత ఇవ్వండి

● నారా లోకేష్‌ను కోరిన ఎమ్మెల్యే కోటంరెడ్డి



నెల్లూరు రూరల్, ఆగస్టు 13 : నెల్లూరు రూరల్ నియోజకర్గంలోని గ్రామాలు, పట్టణ ప్రాంతాల ప్రజా సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించి చేయూతనివ్వాలని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌ను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంలో లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో వెనకబడిన ప్రాంతాలున్నాయని, ప్రత్యేక నిధులివ్వాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మదన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

నెల్లూరు (విద్య), ఆగస్టు 13 : నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవా రం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు మాట్లాడుతూ ఏకాగ్రత, నైతిక విలువలే విజయానికి సోపానాలని, విద్యార్థులు వారి శక్తిసామర్థ్యాలను తెలుసుకుని లక్ష్యాన్ని చేరుకోవడానికి మార్గాలు అన్వేషించాలన్నారు. దీనికోసం గురువులు, తల్లిదండ్రుల సూచనలు, సలహాలు తప్పక పాటించాలన్నారు. అనంతరం అంతర్జాతీయ మార్కెటింగ్ కార్పొరేషన్ అధ్యక్షుడు వై శ్రీనివాస్ నైతికవిలువలు, జ్ఞానం, కెరీర్ తదితర అంశాలను విద్యార్థినులకు వివరించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ ప్రమోటర్ మల్లికార్జున, అధ్యాపకుడు నరసింహం, రిటైర్డ్ కామర్స్ లెక్చరర్ కే కుసుమకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కరుణకుమారి, ప్రసన్న, భారతి, సిబ్బంది పాల్గొన్నారు.



కెరీర్ గైడెన్స్‌పై మాట్లాడుతున్న ఆర్ఐవో శ్రీనివాసులు

మందుల దుకాణాలను సక్రమంగా నిర్వహిస్తాం

● జిల్లా కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్

నెల్లూరు(వైద్యం) ఆగస్టు 13 : ఔషధ నియంత్రణ శాఖ నిర్దేశించిన నిబంధనల ప్రకారమే మందుల దుకాణాలను సక్రమంగా నిర్వహిస్తామని కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పేరూరి ప్రదీప్ తెలిపారు. ఇటీవల ఎన్నికైన సంఘం కమిటీ నేతలు మంగళవారం ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వీరకుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ కీర్తి పవిత్రను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రదీప్ మాట్లాడుతూ జిల్లాలో 2250 మెడికల్ షాపులు ఉన్నాయని, వాటి నిర్వాహకులందరికీ త్వరలో గుర్తింపు కార్డులు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి నరేంద్రబాబు, అయితా భాస్కర్, అశోక్‌సాయి, అనిల్, లీల, బాబు తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ'లో మూర్ఛవ్యాధి రోగులకు ప్రత్యేక క్లినిక్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యులు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 13 : నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మూర్ఛ వ్యాధి రోగులకు ఒక ప్రత్యేక క్లినిక్ ఏర్పాటు చేశామని ఆసుపత్రి న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ సంపత్‌కుమార్ వెల్లడించారు. దీనికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆసుపత్రిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ మాట్లాడుతూ ఎంతో మంది మూర్ఛ వ్యాధిగ్రస్తులు సరైన అవగాహన లేక, పేదరికంతో వైద్య చికిత్సలు చేయించుకోవటం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీన ప్రత్యేకంగా వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. న్యూరోసర్జన్ డాక్టర్ సాయికుమార్ మాట్లాడుతూ మూర్ఛవ్యాధికి చికిత్స అందించేందుకు నారాయణ ఆసుపత్రిలో ఎన్నో ఆధునిక పరికరాలు ఉన్నాయన్నారు. ఆసుపత్రి మెడికల్ సూపరిడెంటెండ్ డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన నిర్వహించే వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి అన్నిరకాల పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. ఎమ్మారై, ఈఈజీ వంటి పరీక్షలకు 50 శాతం రాయితీ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్, న్యూరాలజిస్ట్ డాక్టర్ అనూష, ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీకే కళాశాలలో ఫొటో ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎల్‌డీఎం శ్రీకాంత్ తదితరులు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 13 : భారత ప్రభుత్వ ఆదేశాలతో లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంకు ఆధ్వర్యంలో నగరంలోని డీకే కళాశాలలో మంగళవారం ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. ఈనెల 15 వరకు ఇది కొనసాగుతుంది. భారతదేశ విభజన భయానక దినోత్సవం నేపథ్యంలో అప్పటి భారతీయులు పడిన కష్టాలు, ప్రాణనష్టాన్ని స్మరించుకుంటూ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం శ్రీకాంత్ ప్రదీప్, కళాశాల ప్రిన్సిపల్ గిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యతో అసమానతల తొలగింపు : కిషోర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట),ఆగస్టు 13: కులమత, ఆర్థిక అససమానతలను రూపుమాపగల శక్తి విద్యకు ఉందని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆ పార్టీ తరపున నగరంలోని మోడల్ హైస్కూల్, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యను అభ్యసించి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. పార్టీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. వ్యాసరచన పోటీల విజేతలకు గురువారం బహుమతులు అందిస్తామని తెలిపారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 13: దేశ ప్రధాని మోదీ పిలుపుమేరకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి ఆధ్వర్యంలో నగరంలోని సంతపేటలో ఉన్న మోడల్ స్కూల్ విద్యార్థులతో ఆజాదీక అమృత్ మహోత్సవం వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఇందులో 500 మంది విద్యార్థులతో పాఠశాల ప్రాంగణం నుంచి వందేమాతరం, భారత్ మాతాకీ జై అనే నినాదాలతో భాగంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. బీజేపీ సంతపేట మండలం అధ్యక్షుడు భాస్కర్, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్, మహిళా మోర్చా అధ్యక్షురాలు కరణం సుభాషిణి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గంటా విజయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

అట్టముక్కలతో జాతీయ చిహ్నం



నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 13 : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నగరానికి చెందిన సంతానం అండ్ కో పుస్తక విక్రేత నరసింహచార్యులు అట్టముక్కలతో జాతీయ చిహ్నాన్ని రూపొందించారు. 3డీలో పొడి అట్టముక్కలతో 2 అడుగుల ఎత్తు, 12 కేజీల బరువుతో తయారు చేశారు. వచ్చే సంవత్సరం ప్రారంభమవుతున్న ప్రపంచంలోనే అతి పెద్దదైన యుగేయుగేన్ భారత్ నేషనల్ మ్యూజియంలో తన శిల్పాన్ని ప్రత్యేక ప్రదర్శనగా ఉంచాలని శిల్పి నరసింహం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రేపు పెన్షనర్స్ సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 13 : నగరంలోని భక్తవత్సల నగర్‌లో ఉన్న పెన్షన్ భవనంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, ప్రధాన కార్యదర్శి ఎస్‌పీవీఎస్ మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశం ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందని, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం పలు అంశాలపై చర్చిస్తామని తెలిపారు.

టౌన్ ప్లానింగ్ అధికారులు బెదిరిస్తున్నారు

● గచ్చు కాలువ గట్టు నివాసులు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 13 : పొగతోట కాశికాయల అగ్రహారం గచ్చుకాలువ మీద ఉన్న 40 ఎస్సీ కుటుంబాలను నెల్లూరు టౌన్ ప్లానింగ్ అధికారులు ఖాళీ చేయమని బెదిరిస్తున్నారని సందెపూడి వెంకట రమణయ్య ఆరోపించారు. ఆ కాలువ గట్టున నివసించే వారు బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులకు తమ ఆవేదన వ్యక్తం చేశారు. తాము కాలువ గట్టున 80 ఏళ్లుగా కాపురం ఉంటూ ఇంటి పన్ను, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. తమకు ప్రభుత్వం నివాసయోగ్య పట్టాలు మంజూరు చేసి ఉన్నప్పటికీ ఇళ్లు ఖాళీ చేయాలని 42 మందికి టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చి వేధిస్తున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రకేసరి జయంతికి ఏర్పాట్లు చేయండి

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 13 : ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి ఉత్సవాలకు నగరంలోని ఆయన విగ్రహం వద్ద ఏర్పాట్లు చేయాలని మంగళవారం మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ నగర కమిషనర్ సూర్యతేజ్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రకాశం పంతులు జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న ఆంధ్రకేసరి విగ్రహం ఐల్యాండ్‌ను సుందరంగా తీర్చిదిద్దాలని, మెట్లను సరిచేయించాలని కోరారు. మిత్రుల సహకారంతో 2025 జనవరికి ఆంధ్రకేసరి కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

ఆధునిక కాలానికి శ్రీసత్యంజీ హైవే డ్రీమ్ హౌసెస్



నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 13 : సత్యంజీ గ్రూపు స్థాపించి 23 ఏళ్లయిందని, తమ ఖాతాదారులు చూపుతున్న ఆదరణ ఎనలేనిదని, వారి అభిమానంతోనే జిల్లాలో అనేక వెంచర్లు పూర్తి చేయగలిగామని ఆ గ్రూపు సంస్థ అధినేత సత్యంజీ తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల తరువాత మెగా డ్రీమ్ ప్రాజెక్టును నేషనల్ హైవేకు ఆనుకొని గూడూరుకు దగ్గరలో చిల్లకూరు పోలీసు స్టేషన్ వెనుక 25 ఎకరాల విస్తీర్ణంలో మొదటి ఫేస్ ప్రారంభించామని చెప్పారు. ఇందులో ఓపెన్ ప్లాట్లు, విల్లాస్, అపార్టుమెంట్లు ఉన్నాయని చెప్పారు, 25 అంకణాల స్థలంలో 30 అంకణాల కట్టుబడి కలిగిన డూప్లెక్సు హౌస్‌ను రూ.99 లక్షలకు విక్రయిస్తున్నామని చెప్పారు. జిల్లా ప్రజలు ఆదరించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
5
ANDHRAJYOTHY
తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 14 ఆగస్టు 2024

అప్పుడు వైసీపీ, ఇప్పుడు కూటమి నేతలు..
ఆగని ఇసుక దోపిడీ



పెన్నలపాడు వద్ద స్వర్ణముఖి నదిలో ఇసుక కోసం బారులు తీరిన టిప్పర్లు, ట్రాక్టర్లు.

హమ్మయ్య... ఇక ఇసుక కష్టం తొలగిందనుకున్న ప్రజలకు తీవ్ర నిరాశ ఎదురవుతోంది. ప్రభుత్వం మారినా నాయకుల తీరు మారలేదు. అధికారంలో ఎవరున్నా ఇసుక దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతూనే ఉందని జిల్లాలోని పరిణామాలు నిరూపిస్తున్నాయి. తిరుపతి జిల్లాలో ఇసుక ఖజానా స్వర్ణముఖి నది. ఈ నదిలో ఎక్కడా అధికారిక రీచ్‌లే లేకపోయినా అనేక ప్రాంతాల్లో జేసీబీలతో తవ్వి, లారీల్లో, ట్రాక్టర్లలో తరలించేస్తున్నారు. చెన్నైలో లారీ ఇసుక రూ.80 వేల నుంచీ లక్ష దాకా పలుకుతుండడంతో ఉత్తరాంధ్ర నుంచి గెలిచిన కూటమి నాయకుడు ఒకరు రంగంలోకి దిగి ఇసుక స్మగ్లింగ్ పగ్గాలు చేతికి తీసుకున్నారు. స్థానిక నేతలను తగినట్లుగా శాంతపరిచి రూ.వందల కోట్ల ఇసుక దోచేసేందుకు తగిన స్కెచ్‌తో ముందుకుపోతున్నారు. మరోవైపు ఉచితం అని చెప్పిన ఇసుకకు ఇన్ని కష్టాలేమిటి బాబూ అని ప్రజలు లబోదిబోమంటున్నారు. రవాణా చార్జీల పేరుతో బాదేస్తున్నారని వాపోతున్నారు. అప్రమత్తమై కఠినంగా వ్యవహరించకపోతే కూటమి ప్రభుత్వం మీద కూడా ఇసుక మచ్చ పడే అవకాశం ఉంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



పెన్నలపాడు వద్ద స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు

తెర వెనుక ఉత్తరాంధ్ర బడా నేత

తొట్టంబేడు ఇసుక అక్రమ దందా వ్యవహారంలో ఉత్తరాంధ్రకు చెందిన ఓ బడా నేత తెర వెనుక ప్రధాన పాత్ర వహిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి కడప జిల్లా నుంచీ తండ్రి సారా వ్యాపారం కారణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అడుగుపెట్టిన ఈయన గతంలో టీడీపీ అధినేతకు అత్యంత సన్నిహితంగా మెలిగారు. ప్రస్తుతం కూటమిలోని ఓ పార్టీ నుంచి ఇటీవలి ఎన్నికల్లో ఉత్తరాంధ్ర నుంచీ ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారు. ఉత్తరాంధ్ర నుంచే తన మనుషులను శ్రీకాళహస్తికి పంపి ఇసుక దందా నడుపుతున్నారని చెబుతున్నారు. శ్రీకాళహస్తి ప్రాంత నేతలకు ప్రత్యక్షంగా ప్రమేయం లేకపోయినా, ఆయన పంచుతున్న వాటాలకు తలొంచినట్లు ప్రచారం ఉంది. ఇక ఇసుక తమిళనాడుకు తరలే మార్గాల్లోని అధికార పార్టీ నేతలు అభ్యంతరం చెప్పకుండా వారికి కూడా పర్సెంటేజీలు ఖరారు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. అధికార కూటమిలోని బడా నేత వెనుక ఉండడంతో తిరుపతి, చిత్తూరు జిల్లాల యంత్రాంగాలు సైతం గట్టిగా వ్యవహరించడం లేదని అంటున్నారు.

శ్రీకాళహస్తి ప్రాంతంలో రీచ్‌లే లేవు

శ్రీకాళహస్తిలో అధికారికంగా ఇసుక రీచ్‌లు లేవు. ఇసుక రీచ్‌ల కోసం పరిశీలన కూడా ఇప్పటిదాకా జరగలేదు. మైన్స్ అండ్ జియాలజీ శాఖ, ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్తంగా రీచ్‌లను ఎంపిక చేయాల్సి వుంది. ఆ తర్వాతే అనుమతులు ఇస్తాం.

- రవిశంకర్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీవో

ఇసుక ట్రాక్టర్... ఎప్పుడెంత?

ప్రాంతం	2018లో (టీడీపీ హయాంలో)	2019-2024 మధ్య (వైసీపీ ప్రభుత్వంలో)	ప్రస్తుత ధరలు
తిరుపతి	రూ. 2000	450	2200
గూడూరు	1800	7500	5000
శ్రీకాళహసి	1500	2500	3000
నాయుడుపేట	1280	4500	4000
పుత్తూరు	2800	4500	3500
వెంకటగిరి	2200	4.500	4,000

- శ్రీకాళహస్తి, తిరుపతి రూరల్, చంద్రగిరి ప్రాంతాల్లో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు, తరలింపులు
- అనధికారిక రీచ్‌ల్లో అక్రమ తవ్వకాలపై స్పందించని జిల్లా యంత్రాంగం

శ్రీకాళహస్తిలో కొల్లగొడుతున్నారు ఇలా..

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలంలోని విరూపాక్షపురం, పెన్నలపాడు గ్రామాల వద్ద స్వర్ణముఖి నదిలో భారీఎత్తున అక్రమ ఇసుక తవ్వకాలు ప్రారంభమయ్యాయి. విరూపాక్షపురం వద్ద 19రోజులుగా తవ్వకాలు జరుగుతుంటే పెన్నలపాడు వద్ద 16 రోజులుగా నడుస్తున్నాయి. నిజానికి ఇక్కడ రీచ్‌లకు ప్రభుత్వం నుంచీ ఎలాంటి అనుమతులూ లేవు. అయినా విరూపాక్షపురం వద్ద నదిలో ఏకంగా ఐదు కిలోమీటర్ల మేర అంతర్గత గ్రావెల్ రోడ్డు నిర్మించుకుని మరీ ఇసుక తరలిస్తున్నారు. మూడు ఇటాచీలు, రెండు జేసీబీలు నిరంతరాయంగా ఇక్కడ పనిచేస్తున్నాయి. టిప్పర్లు, టర్బో లారీలు, ట్రాక్టర్లు బారులు తీరి ఉంటున్నాయి. ఇక్కడ ఇసుక నింపుకుని పది కిలోమీటర్ల దూరంలోని జ్ఞానమ్మ కండ్రిగ వద్ద ప్రైవేటు భూమిలో డంప్ చేస్తున్నారు. ఈ అనధికారిక రీచ్‌లు నిర్వాహకుల కార్లతో సందడిగా ఉంటున్నాయి. ఇక డంప్ వద్ద సోలార్ పవర్‌తో పనిచేసే సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేసుకున్నారు. పెన్నలపాడు వద్ద స్వర్ణముఖి నది మధ్యలోనే రోడ్డు నిర్మించి ఇసుక తవ్వకాలు చేపట్టారు. వారం రోజులుగా ఇక్కడ రెండు ఇటాచీలు, ఒక జేసీబీ ఇసుక తవ్వి లారీలకు, ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్నాయి. ఇక్కడ ట్రాక్టర్ల కంటే టర్బో లారీలే అధికంగా వున్నాయి.



విరూపాక్షపురం వద్ద ఇసుక తరలించేందుకు బారులు తీరిన టిప్పర్లు, ట్రాక్టర్లు.

కింద ఇసుక దాచి తరలిస్తున్నారు.

శ్రీకాళహస్తి ప్రాంతం నుంచి ప్రధానంగా చెన్నైకి ఇసుక తరలిపోతోంది. ఇసుక మీద ఒక వరుస ఇటుకలు నింపుకుని కొన్ని లారీలు, తెలుగుగంగ కాలువ రోడ్డు మార్గంలో స్టోన్ క్రషర్స్ వద్ద ఇసుకపైన రాతి పొడి నింపుకుని కొన్ని లారీలు చెన్నైకి చేరుతున్నాయి. మరికొన్ని లారీలపై ధాన్యం పొట్టు, వరి ధాన్యం వంటి బస్తాలు వేసి వాటిపై గ్రీన్ మ్యాట్ వేసుకుని దర్జాగా సరిహద్దులు దాటేస్తున్నాయి. ఎక్కువగా తొట్టంబేడు నుంచీ బీఎన్ కండ్రిగ, తడ మండలాల మీదుగా తమిళనాడుకు ఇసుక తరలి వెళ్లేది. అయితే తిరువళ్లూరు జిల్లా పోలీసు అధికారి కఠినంగా వ్యవహరిస్తుండడంతో ఎక్కువ లారీలు ఏర్పేడు, రేణిగుంట, తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల, పూతలపట్టు, చిత్తూరు, వేలూరుల మీదుగా చెన్నై చేరుతున్నట్టు సమాచారం. అలాగే జీడీనెల్లూరు మీదుగా తమిళనాడు సరిహద్దులు దాటిస్తున్నట్టు చెబుతున్నారు.

రూ.60 కోట్లు మింగేశారు

విరూపాక్షపురం, పెన్నలపాడు గ్రామాల నుంచీ 300 లారీలు ఇసుక తరలింపులో బిజీగా ఉన్నాయి. రోజుకు రెండు ట్రిప్పుల చొప్పున మొత్తం 600 లారీల ఇసుక చెన్నైకి తరలుతోంది. చెన్నైలోని రెడ్ హిల్స్ ప్రాంతానికి చేరుతున్న లారీ లోడ్ ధర అక్కడ రూ. 80 వేలదాకా ఉందని అంటున్నారు. నిర్మాణాల్లో పూత పనికి వినియోగించే నున్నటి ఇసుక ధర రూ. లక్ష పలుకుతోందని సమాచారం. ఇలా ఇరవై రోజులుగా దాదాపు రూ. 60 కోట్లు సొమ్ము చేసుకున్నట్టు అంచనా.

రశీదులు కూడా ఇస్తున్నారు

విరూపాక్షపురం, పెన్నలపాడు నుంచి ట్రాక్టర్లలో స్థానిక అవసరాలకు కూడా ఇసుక తరలుతోంది.అయితే 300 లారీలకు ఇసుక నింపాకే స్థానిక అవసరాలకు కేటాయిస్తున్నట్టు సమాచారం. జేసీబీ ద్వారా ట్రాక్టర్‌కు ఇసుక లోడ్ చేస్తే రూ.1100 చొప్పున,కూలీలు లోడ్ చేస్తే రూ.500 చొప్పున అనధికారిక రీచ్ నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. రోజువారీ 300ట్రాక్టర్ లోడ్ల ఇసుక శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట, తిరుపతి, బీఎన్ కండ్రిగ, వరదయ్యపాలెం మండలాలకు వెళుతోంది.ఎక్కువమంది ట్రాక్టర్ ఆపరేటర్లు జేసీబీ ద్వారానే ఇసుక లోడ్ చేయించుకుంటున్నారు.జేసీబీలతో నింపే ట్రాక్టర్ల నుంచీ వసూలు చేస్తున్న రూ.1100కు అనధికారిక రీచ్ నిర్వాహకులు రశీదు కూడా ఇస్తున్నారు. ఎస్‌కేఈ ట్రేడింగ్ కంపెనీ పేరిట ఇస్తున్న రశీదులపై ప్లాట్ నంబరు 29, కవిత అపార్ట్‌మెంట్స్, బెంజ్ సర్కిల్, విజయవాడ అన్న చిరునామా ముద్రించి వుంది. ఈ కంపెనీ ఎవరిదో, వీరికి రీచ్ అనుమతి ఎవరు ఇచ్చారో ప్రభుత్వం తేల్చాల్సివుంది.

తొట్టంబేడు మండలంలోని అనధికారిక ఇసుక రీచ్‌ల్లో ఇసుక ట్రాక్టర్లకు జారీ చేస్తున్న రశీదు





విరూపాక్షపురం వద్ద స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు

వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చి... ఇసుక దందా

ఏర్పేడు మండలం కొత్త వీరాపురం - మోదుగులపాలెం గ్రామాల మధ్య స్వర్ణముఖి నదిలో గత నెల 28 నుంచీ ఈనెల 1వ తేదీ వరకూ ఇసుక అక్రమ తవ్వకాలు భారీగా జరిగాయి. టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడొకరి కుమారుడి పేరు ఈ దందా వెనుక ప్రధానంగా వినిపించింది. ఆ మాజీ బోర్డు సభ్యుడు గత ఐదేళ్లు వైసీపీలో వుండి ఎన్నికల ముందు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అతడి కుమారుడు గత వైసీపీ ప్రభుత్వంలో రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డికి సన్నిహితంగా మెలిగారు. ఆయనే స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు మొదలుపెట్టారు. అయితే ఈ నెల 1వ తేదీన మోదుగులపాలెం సర్పంచ్ జయరామయ్య, గ్రామస్తులు తవ్వకాలను అడ్డుకుని రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తవ్వకాలు జరుపుతున్న యంత్రాలను అధికారులు పంపివేసి, వాహనాలు నదిలోకి రాకుండా ట్రెంచి తవ్వించారు. నదిలో వేసిన రోడ్డును కూడా తవ్వించేశారు. ప్రస్తుతానికి ఇక్కడ ఇసుక దందా ఆగింది.



జ్ఞానమ్మ కండ్రిగ వద్ద అనధికారిక ఇసుక డంప్

ఉచితం... కాస్త ఖరీదే!

వైసీపీ ప్రభుత్వ పాలనలోకన్నా ఇసుక ధరలు తగ్గాయి కానీ ప్రజలు ఆశించినంత మాత్రం కాదు. పైగా ఇసుక దొరకడం కష్టంగా మారింది. జిల్లాలో ఇసుక రీచ్‌లను ఇంకా ప్రారంభించలేదు. ప్రస్తుతం స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకనే ఇస్తున్నారు. ఇసుక ఉచితమే అయినా లారీలోకి లోడ్, అన్‌లోడ్ చేయడానికి, ఇంటివరకు తీసుకెళ్లడానికి అయ్యే రవాణా ఖర్చు మాత్రం వినియోగదారు భరించాల్సి వస్తోంది. ఈ భారం రకరకాలుగా ఉంది. అనధికార రీచ్‌ల్లో అయితే ఇష్టానుసారం బాదేస్తున్నారు.

జిల్లాలోని స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుక

మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. పిచ్చాటూరు మండలం కృష్ణగిరి వద్దగల అడివికొడియంబేడు స్టాక్ పాయింట్‌లో 139017 మెట్రిక్ టన్నుల ఇసుక ఉంది. నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిగ స్టాక్ పాయింట్ వద్ద 2241 మెట్రిక్ టన్నులు, వెంకటగిరి స్టాక్ పాయింట్‌లో 941, దొరవారిసత్రం- సూళ్లూరుపేటలో 21465 మెట్రిక్ టన్నులు ఉన్నాయి.నిర్వహణ ఖర్చులు కింద టన్నుకు పిచ్చాటూరు, నాగలాపురంలో మెట్రిక్ టన్నుకు రూ.200, వెంకటగిరిలో రూ.590, సూళ్లూరుపేటలో రూ.465 వసూలు చేస్తున్నారు. దూరాన్ని బట్టి రవాణా ఖర్చులుంటాయి. కాగా చంద్రగిరి మండలంలోని నాగయ్యగారి పల్లె, శానంబట్ల ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఏర్పాటుచేయడానికి అధికారులు పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. చంద్రగిరి మండలంలో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేస్తే తిరుపతి ప్రజలకు ఇంకా తక్కువ ధరకే ఇసుక లభించే అవకాశం ఉంది.



మోదుగులపాలెం వద్ద ఇసుక తవ్వకాల కోసం నిర్మించిన రోడ్డును తవ్వించేసిన రెవిన్యూ అధికారులు, గ్రామస్తులు

చంద్రగిరి నియోజకవర్గంలో ఇసుక దొంగలు

స్వర్ణముఖి నది జన్మస్థలమైన చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లోనూ ఇసుక అక్రమ దందా విచ్చలవిడిగా సాగుతోంది. రోజుకు సుమారు 100కు పైగా ట్రాక్టర్లు అక్రమంగా స్వర్ణముఖి నదిని తోడేస్తున్నాయి. నరసింగాపురం, రెడ్డివారిపల్లె సమీపంలో పెద్దఎత్తున ఇసుక తరలిస్తున్నారు. అదేవిధంగా తిరుపతి రూరల్ మండలం సిగొల్లపల్లి సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. సమీప గ్రామాలైన పైడిపల్లి, గొల్లపల్లె, దుర్గసముద్రం, చిగురువాడ, పాతకాల్వ, రామానుజపల్లె, అడపారెడ్డిపల్లె గ్రామాలకు చెందిన ట్రాక్టర్ యజమానులు పార్టీలకతీతంగా ఇసుకను తరలిస్తున్నట్టు తెలుస్తోంది. అధికార పార్టీ నేతలు చెప్పిన ట్రాక్టర్లను మాత్రమే ఎస్‌ఈబీ అధికారులకు అనుమతిస్తున్నట్టు తెలుస్తోంది. ఒక్కో ట్రాక్టరు రూ.10వేలు అడ్వాన్సుగా చెల్లించడంతో పాటు రోజూ వెయ్యి రూపాయలు నేతలకు సమర్పించుకోవాల్సివస్తోందన్న ఆరోపణలున్నాయి.





చంద్రగిరి మండలంలో ఇసుక తరలింపు - తిరుపతి రూరల్ మండలంలో ఇసుక తరలింపు



మోదుగులపాలెం వద్ద స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు, తరలింపు కోసం నదిలోనే నిర్మించిన రోడ్డు

నెల్లూరు కల నెరవేరింది
షార్ సందర్శనపై పవన్ కల్యాణ్



రాకెట్ అనుసంధాన భవనం వద్ద షార్ డైరెక్టర్ రాజరాజన్‌తో పవన్

సూళ్లూరుపేట, ఆగస్టు 13 : నెల్లూరులో చదువుకునే రోజుల్లో శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగాలు చేపడతారని తెలిసి అక్కడికి వెళ్లాలనుకున్నా.అయితే శాస్త్రవేత్తలుంటారు కాబట్టి భారీ భద్రతా ఏర్పాట్లుంటాయి కాబట్టి వెళ్లలేమలే అనుకునే వాడిని.అయితే ఈ రోజు యాదృచ్ఛికంగా అంతరిక్ష దినోత్సవానికి హాజరై షార్ సందర్శించడమనే కల నెరవేరింది....అంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు.ఎవరైనా మంచిని బలంగా కోరుకుంటే అది తప్పకుండా నెరవేరుతుందనేది తన విషయంలో నిజమైందన్నారు. షార్‌లో మంగళవారం జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని కురుప్ ఆడిటోరియంలో జ్యోతి ప్రజ్వలన చేసి అంతరిక్ష దినోత్సవాలను ప్రారంభించారు.అనంతరం షార్ శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఒకప్పుడు 40 వేల ఎకరాల చిట్టడవిలో ఉన్న శ్రీహరికోట నేడు దేశానికే తలామానికంగా మారిందంటే అది శాస్త్రవేత్తల ఘనతేనని తెలిపారు.అంతరిక్షంలోకి మనిషిని పంపడం మన ముందున్న సవాల్ అని అది కూడా శ్రీహరికోట నుంచి పంపించేందుకు సన్నాహాలు చేయడం శుభపరిణామమన్నారు.ఇస్రో పరిశోధనలకు, కార్యక్రమాలకు ఏపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందన్నారు. ఏపీ యువతలో అపరిమితమైన జిజ్ఞాస వుందని, దాన్ని సరైన రీతిలో ముందుకు తీసుకెళ్ళే దారి లేక యువత ప్రత్యామ్నాయాల వైపు చూస్తోందన్నారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థుల్లో అంతరిక్ష పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందించాల్సిన అవసరముందన్నారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనల ఫలాలు సామాన్యులకు సైతం అందినప్పుడే నిజమైన విజయమన్నారు.అందులో భాగంగానే అంతరిక్ష పరిశోధనల గురించి గ్రామీణ యువతకు సైతం తెలియజేసేందుకు ఇస్రో ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్ల కలను చంద్రయాన్-3 విజయంతో నెరవేర్చుకొన్నామని, ఇది దేశానికి కానుకగా ఇస్రో ఇచ్చిన భారీ విజయమన్నారు. 2023వ సంవత్సరం ఆగస్టు 23న చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ అయిన రోజును భారత ప్రభుత్వం అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.దేశ వ్యాప్తంగా సంబరాలు చేసి మారుమూల గ్రామాలకు సైతం అంతరిక్ష పరిశోధనలు తీసుకెళ్లడం మంచిదన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల భావి తరాలకు ఎంతో ఉపయోగమన్నారు.అంతరిక్ష దినోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పవన్ కల్యాణ్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.పవన్‌కు అధికారులు చంద్రయాన్ 3రాకెట్ నమూనాను బహూకరించారు.అంతకుముందు పవన్ కల్యాణ్‌కు హెలిప్యాడ్ వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్,ఎస్పీ సుబ్బరాయుడు, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ స్వాగతం పలికారు.కురుఫ్ ఆడిటోరియంలో ఆయనకు షార్ డైరెక్టర్ చంద్రయాన్-3 రాకెట్ నమూనాను, ఉపగ్రహాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసుల రెడ్డి,అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ అహ్మద్, డిప్యూటీ డైరెక్టర్ టీఎస్ రఘురామ్, గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శాస్త్రవేత్తలు ఇచ్చిన చంద్రయాన్-3 శాటిలైట్ నమూనాను అబ్బురంగా చూస్తున్న పవన్‌కల్యాణ్

షార్ రోడ్డును ఐదు రోజుల్లో బాగు చేయిస్తాం!

తిరుపతి నుంచీ షార్ వెళ్ళే మార్గంలో బుచ్చినాయుడు కండ్రిగ నుంచీ షార్ వరకూ 17 కిలోమీటర్ల మేరకు రోడ్డును ఐదు రోజుల్లో బాగు చేయిస్తామని పవన్ కళ్యాణ్ హామీఇచ్చారు. ఈ రోడ్డు బాగాలేదని షార్ అధికారులు తన దృష్టికి తెచ్చారని, వెంటనే తాను కలెక్టర్‌తో మాట్లాడి రోడ్డు పనులు మొదలు పెట్టించానన్నారు.మరో ఐదు రోజుల్లో పనులు పూర్తవుతాయన్నారు. ఇలాంటి పనులు చేపట్టే బాధ్యత తామే తీసుకుంటామన్నారు.

షార్‌లో వివిధ విభాగాల సందర్శన

షార్‌లో వివిధ విభాగాలను పవన్ కల్యాణ్ సందర్శించారు. లాంచ్‌ప్యాడ్, రాకెట్ అనుసంధానం చేసే వీఫ్ భవనంతో పాటు ఎంసీసీ భవనాన్ని ఆయన సందర్శించారు.అంతరిక్ష కేంద్రంలో ఉన్న విభాగాల గురించి పవన్‌కు శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా వివరించారు. షార్‌లోని విభాగాల సందర్శనానంతరం మధ్యాహ్నం 4.30 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకొని తిరుగుపయనమయ్యారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకుందాం






గూడూరులో త్రివర్ణ పతాక ర్యాలీ - నాయుడుపేటలో తిరంగా ర్యాలీ - వాకాడు అశోక్ పిల్లర్ వద్ద విద్యార్థుల మానవహారం - వెంకటగిరిలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో తిరంగా బైక్ ర్యాలీ

గూడూరు, ఆగస్టు 13: దేశస్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయులను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని గూడూరు రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం వివేకానంద కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషన్ నుంచి పట్టణంలో 75 అడుగుల జాతీయజెండాతో విద్యార్థులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది మహానుభావులు తమ ప్రాణాలను లెక్క చేయకుండా పోరాటాలు సాగించి స్వేచ్ఛ కల్పించారన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సీఐ గురులాల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీజేవైఎం ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక రెండోపట్టణ పరిధిలోని స్వర్ణాంధ్రభారతి జూనియర్ కళాశాల నుంచి కోర్టు సెంటర్ వరకు విద్యార్థులు భారత్‌మాతాకి జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ మాట్లాడుతూ... ప్రతి ఇంటి మీద జాతీయజెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో శివశంకర్, ప్రకాష్‌నాయుడు, నిరంజన్‌రెడ్డి, నవకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● **నాయుడుపేట టౌన్:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి కోరారు. మున్సిపాలిటీ, వార్డు సచివాలయ సిబ్బందితో పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ప్రిన్సిపాల్ మధుసూదన వర్మ హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు.

● **వాకాడు:** నేటి స్వాతంత్ర్యఫలాలు ఆనాటి నేతల పోరాట ఫలితమని ఎంపీడీవో వెంకటేశ్వర రావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరంగా ర్యాలీను చేపట్టారు. ఎంఈవో నసీం అలీ, గురుకుల ప్రిన్సిపాల్ రామాంజనేయులు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి అశోక్ పిల్లర్ వరకు వందేమాతరం, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు.

● **వెంకటగిరి టౌన్:** స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ సమన్వయకర్త ఎస్ఎస్ఆర్ నాయుడు ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ

గూడూరు, ఆగస్టు 13: స్థానిక బనిగీసాహెబ్‌పేట వద్ద ఇటీవల జరిగిన హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రమణకుమార్ చెప్పారు. మంగళవారం 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియాకు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని మసీదువీధికి చెందిన సోనియాతో బనిగీసాహెబ్‌పేటకు చెందిన అల్లాబక్షుకు 2020లో వివాహం జరిగిందన్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏడాదిగా భార్యభర్తలిద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తడంతో భర్త, అత్తమామలపై 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారన్నారు. సోనియా తన పిల్లలతోపాటు బనిగీసాహెబ్‌పేటలోని భర్త ఇంట్లో కాపురం ఉంటుండగా, సమీపంలో అల్లాబక్షు అతని తల్లిదండ్రులతో నివాసం ఉంటున్నాడన్నారు. తన భార్య తన ఇంట్లోనే ఉంటూ తమపైనే కేసులు పెట్టడంపై కక్ష పెంచుకున్నాడన్నారు. ఈక్రమంలో ఈనెల 10న మధ్యాహ్నం సోనియా సోదరుడు జాకీర్... సోనియా ఇంట్లో భోజనం చేస్తుండగా అటువైపు వెళ్తున్న అల్లాబక్షు తండ్రి కోడలితో వాగ్వాదానికి దిగాడన్నారు. సమీపంలో ఉన్న అల్లాబక్షు, అతని తల్లి రోకలిబండ, ప్లాస్టిక్‌పైపుతో సోనియా, జాకీర్‌పై దాడి చేశారన్నారు. తీవ్రగాయాలపాలైన జాకీర్, సోనియాను ఏరియా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారన్నారు. అప్పటికే జాకీర్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారన్నారు. సోనియా మరో సోదరుడు షాకీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మంగళవారం మండలంలోని తిప్పవరప్పాడు జంక్షన్ వద్ద వున్న అల్లాబక్షు, ఆయన తల్లిదండ్రులు చాన్‌బాషా, షర్మిలను సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ శ్రీహరిబాబు అరెస్ట్ చేశారన్నారు.

టీడీపీ హయాంలోనే అమరావతి, పోలవరం పూర్తి

● మాజీ మంత్రి డాక్టర్ పరసా



పరసారత్నాన్ని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట, ఆగస్టు 13: రాష్ట్ర రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తవుతాయని మాజీ మంత్రి పరసారత్నం అన్నారు. నాయుడుపేట ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం పరసారత్నం జన్మదినం సందర్భంగా టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. గత 5 సంవత్సరాలలో వైసీపీ ప్రభుత్వ హాయంలో అభివృద్ధి కుంటుపడిందని, సంక్షేమ పథకాలూ అర్హులకు అందలేదన్నారు. కూటమితో రాష్ట్రంలో శాంతి భద్రతలతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రామిరెడ్డి, ముత్యాలయ్య, వెంకటరాజు, చిన్నారావు, ఉక్కుశంకరయ్య, రవి తదితరులు ఉన్నారు.

మెమో రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించాలి

● సదరన్ రైల్వే డెవలెప్‌మెంట్ కమిటీ సభ్యుడు సురేంద్ర



స్టేషన్ మాస్టర్‌తో చర్చిస్తున్న సురేంద్ర

నాయుడుపేట, ఆగస్టు 13: చెన్నై సెంట్రల్ నుంచి సూళ్లూరుపేట వరకు రాకపోకలు సాగించే మెమో రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించాలని సదరన్ రైల్వే డెవలెప్‌మెంట్ కమిటీ సభ్యుడు చిగురాకుల సురేంద్ర అన్నారు. నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఆయన రైల్వే సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నవజీవన్, హైదరాబాద్, చండీఘర్ ఎక్స్‌ప్రెస్‌లకు నాయుడుపేటలో స్టాపింగ్ కల్పించాలని, రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్, ఆర్వోవాటర్ ప్లాంట్, ర్యాంప్, డిజిటల్ క్లాక్ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ తీర్మానాన్ని రైల్వే మంత్రి, సదరన్ రైల్వే డీఎంఆర్‌కు పంపించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో స్టేషన్ మాస్టర్ చిరంజీవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో కార్పొరేట్ విద్యపై ప్రచారం



సూచనలిస్తున్న సీడీపీవో మునికుమారి

కోట, ఆగస్టు 13: అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధిస్తున్న కార్పొరేట్ విద్యపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సీడీపీవో మునికుమారి కోరారు. కోట పట్టణంలోని స్త్రీశిశు సంక్షేమ భవనంలో మంగళవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ వర్కర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీల్లో విద్యాబోధన జరుగుతున్న నేపథ్యంలో ప్రతి చిన్నారిని విధిగా కేంద్రాల్లో చేర్పించాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. సూపర్‌వైజర్ కవిత తదితరులు ఉన్నారు.

తిరుమలలో వరుణ్‌తేజ్, లావణ్య త్రిపాఠి



తిరుమల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సినీహీరో వరుణ్‌తేజ్, లావణ్య త్రిపాఠి దంపతులు శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు వచ్చారు. తిరుమలలోని భాస్కర్‌భవన్ విశ్రాంతి భవనానికి చేరుకున్న వీరికి స్థానిక అభిమానులు స్వాగతం పలికారు. వీరు బుధవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

బీఎస్పీ సమావేశానికి తరలిరండి

కోట, ఆగస్టు 13: కులసంఘ ప్రతినిధుల రౌండ్‌టేబుల్ సమావేశాల్ని విజయవంతం చేయాలని బీఎస్పీ గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.సుబ్రమణ్య కోరారు. బీఎస్పీ రాష్ట్ర నాయకులు పూర్ణచంద్రరావు, పరంజ్యోతిల ఆధ్వర్యంలో ఈ సమావేశాలు జరుగుతాయని బీసీలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఏ రాజకీయపార్టీ ఇప్పటి వరకు కులగణనకు ముందుకురాలేదన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, స్థానిక సంస్థల్లో జనాభా నిష్పత్తి ప్రకారం దామాషాలు కేటాయించాలన్నారు. పాలనలో జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలంటూ చేస్తున్న ఉద్యమాలకు బీసీలు పూర్తి సహకారం అందించాలన్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

సూళ్లూరుపేట, ఆగస్టు 13: సూళ్లూరుపేటలోని జూనియర్ కళాశాలలో నవజీవన్ ఆర్గనైజేషన్, సీసీటీఐ ప్రాజెక్టు సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ వ్యాప్తి చెందకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో పలు సూచనలు చేశారు. గ్రామాల్లో కూడా విద్యార్థులు దీనిపై అవగాహన కల్పిస్తే హెచ్‌ఐవీ రహిత రాష్ట్రంగా చేయవచ్చని సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బాలాజి తెలిపారు. మంజుల, హరిత, నందిని కళాశాల అధ్యాపకుడు చైతన్య కుమార్ పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడిక తొలగింపు



వెంకటగిరి టౌన్, ఆగస్టు 13: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కైవల్యా నది వరకు రోడ్డుకు ఇరువైపులా మున్సిపాలిటీ అధికారులు మురుగునీటి కాలువల్లో పూడిక తీశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రషీద్ మాట్లాడుతూ... అభివృద్ధి పనుల్లో భాగంగా మురుగునీటి కాలువల్లో పూడిక తీత, సెంట్రల్ లైటింగ్, డివైడర్‌పై మొక్కలతో సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. అలాగే మురుగునీటి కాలువలపై ఆక్రమణలు తొలగించామన్నారు.

డిప్యూటీ సీఎం పవన్‌తో ఎమ్మెల్యే విజయశ్రీ భేటీ




రాకెట్ ప్రయోగాల గురించి పవన్‌కు వివరిస్తున్న షార్ డైరెక్టర్, శాస్త్రవేత్తలు - విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న పవన్

సూళ్లూరుపేట, ఆగస్టు 13: అంతరిక్ష దినోత్సవం సందర్భంగా షార్ పర్యటనకు విచ్చేసిన పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకుడు నెలవల రాజేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. షార్‌లోని నక్షత్ర అతిథి గృహంలో ఆయనకు ఎమ్మెల్యే విజయశ్రీ పుష్పగుచ్ఛం అందజేశారు. తమ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని డిప్యూటీ సీఎంను వారు కోరారు.

విద్యార్థులకు బహుమతులు..

అంతరిక్ష దినోత్సవాలను పురస్కరించుకొని షార్‌లో విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలు, ప్రయోగాలు, ఉపగ్రహాలు వాటి పనితీరుపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పవన్ కల్యాణ్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. సూళ్లూరుపేట బాలికల హైస్కూల్ విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారు.

చెత్తనుంచి సంపద క్షేత్ర సందర్శన

ఓజిలి, ఆగస్టు 13: సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణా కార్యక్రమాలలో భాగంగా మంగళవారం ఓజిలి మండలం కురుగొండలో చెత్తనుంచి సంపద కేంద్రం క్షేత్ర సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కురుగొండ సర్పంచి శ్రీలక్ష్మి అధ్యక్షత వహించారు. చెత్తనుంచి సంపద నేపథ్యంలో వర్మీకంపోస్ట్ తయారీపై అవగాహన కల్పించారు.

నాయుడుపేట టౌన్: డంపింగ్ యార్డులో వేసే చెత్తాచెదారాలు, వ్యర్థాల వల్ల పర్యావరణానికి భంగం వాటిల్లకుండా చూడాలని నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి అన్నారు. పుదూరు పంచాయతీ సమీపంలోని అటవీప్రాంతంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌ను జనార్దన రెడ్డి మంగళవారం పరిశీలించారు. చెత్త నుంచి సంపద వచ్చేలా మున్సిపల్ సిబ్బంది ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

వాకాడు: తడిచెత్తతో కంపోస్టు ఎరువు తయారుచేసి మొక్కలకు ఉపయోగించవచ్చని ఎంపీడీవో వెంకటేశ్వరరావు చెప్పారు. వాకాడులోని చెత్తసంపద కేంద్రం వద్ద సర్పంచులకు అవగాహన కల్పించారు. పొడిచెత్తను రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా తిరిగి ఉపయోగించుకోవచ్చని అవగాహన కల్పించారు.

కోట: మండలంలోని తిమ్మానాయుడుపాళెంలో న్న చెత్తనుంచి సంపద తయారీ కేంద్రంలో మంగళవారం వానపాముల తయారీ, సేంద్రియ ఎరువుల ఉత్పత్తులపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు అవగాహన జరిగింది. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ సీహెచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

చిల్లకూరు, ఆగస్టు 13: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీవో మెహబూబీ అన్నారు. మంగళవారం మండలంలోని పారిచెర్లవారిపాళెం ఎస్టీకాలనీవాసులకు బాల్యవివాహాల వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతుంటే వాటిని అడ్డుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతిఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుకమ్మ, సిబ్బంది కృష్ణమ్మ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

వాగులో పడి వృద్ధుడి మృతి

చిల్లకూరు, ఆగస్టు 13: మండలంలోని తిప్పగుంటపాళెంలో వృద్ధుడు వాగులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన పోలయ్య(85) అనే వృద్ధుడు గ్రామానికి సమీపంలోని నీటి వాగు వద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందాడు. పోలయ్యకు మతిస్థిమితం లేక గ్రామంలో తిరుగుతుండేవాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయమూర్తుల నియామకం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 13: రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారిని ఆయా జిల్లాలకు నియమిస్తూ హైకోర్టు విజిలెన్సు రిజిస్ట్రార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శ్రీకాళహస్తిలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న జి.ధర్మారావును అనకాపల్లి మొదటి తరగతి జ్యుడిషియల్ న్యాయమూర్తిగా నియమించారు. కొత్తగా సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారిలో తిరుపతికి చెందిన పల్లెపాగు ప్రశాంత్‌ను మాచర్ల అదనపు మొదటి తరగతి న్యాయమూర్తిగా, చిత్తూరుకు చెందిన ఎం.రోహిత్‌ను విశాఖ జిల్లా నర్సీపట్నం అదనపు మొదటి తరగతి న్యాయమూర్తిగా, చిత్తూరులో స్పెషల్ మొబైల్ కోర్టు, ఐదో అదనపు సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కీర్తనను మదనపల్లె రెండో అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తిగా నియమించారు.

రేపు స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం స్విమ్స్‌లో ఓపీ, ఓటీ సేవలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ ఆర్వీ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం అత్యవసర సేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయన్నారు. రోగులు సహకరించాలని కోరారు.

29న క్రీడా ప్రతిభా అవార్డుల ప్రదానం

తిరుపతి(విద్య), ఆగస్టు 13: జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని 2023-24లో ఏపీ స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభచాటిన ఐదు పాఠశాలలకు ఈనెల 29న క్రీడా ప్రతిభా అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు డీఈవో డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల నుంచి క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థుల సర్టిఫికెట్లను ఆయా స్కూల్స్ హెచ్‌ఎంలు, వ్యాయామ టీచర్లు ధ్రువీకరించి ఈనెల 16వ తేదీలోపు డీఈవో కార్యాలయంలో అందించాలని సూచించారు.

పెసర పంటపై అవగాహన

వెంకటగిరి టౌన్, ఆగస్టు 13: మండలంలోని పాపమాంబపురంలో రైతులకు పెసర పంటపై ఏడీఏ నాగర్జున సాగర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఐపీఎం2-14 రకం పంటను మేలురకంగా గుర్తించామన్నారు. పంటలో పల్లాకు తెగులు ఆశించి ఉన్నందున సిఫారస్సు మేరకు మందుల పిచికారీ అవసరమని రైతులకు సూచించారు. చౌడు భూముల్లో వరి వేసిన రైతులకు దిగుబడి తగ్గకుండా పంట ఎదుగుదలకు దోహదం పడే విధంగా ప్రతి రోజూ నీటిని మార్చాలని సూచించారు. వరి కోతల తరువాత జిప్సం చల్లి పచ్చిరొట్ట పైర్లు వేసి చౌడును నివారించుకోవచ్చన్నారు. ఏవో సుజాతా, రామ్మోహన్, రేఖ, రైతులు పాల్గొన్నారు.

దాడి: ముగ్గురిపై కేసు

చిల్లకూరు, ఆగస్టు 13: స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని ఓ దాబా వద్ద సోమవారం రాత్రి వాసుపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. గూడూరుకు చెందిన వాసు పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని దాబా వద్ద టిఫిన్ చేస్తుండగా గూడూరుకే చెందిన జయ, జమీర్, దీపు పాత కక్షల నేపథ్యంలో దాడి చేశారు. దాడిపై పోలీసులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం

బాలాయపల్లి, ఆగస్టు 13: గూడూరు- వెంకటగిరి రోడ్డు పనులను ప్రారంభి స్తున్నట్లు రోడ్డు భవనాల శాఖ ఈఈ రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం బాలాయపల్లిలో గూడూరు - వెంకటగిరి రోడ్డును పరిశీలించారు. వెంకటగిరి సమీపం అమ్మపాలెం నుంచి ఐదు కిలోమీటర్లు వరకు వెంటనే రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు జరిగేటప్పుడు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఏఈ బాబు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య సంరక్షణ పోటీల విజేతల ఎంపిక

తిరుపతి(విద్య), ఆగస్టు 13: ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌లో రాష్ట్ర జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలని ఎంపిక చేసినట్లు రాష్ట్ర కోఆర్డినేటర్ నీలకంఠ తెలిపారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు జీవ వైవిధ్య సంరక్షణలో యువతపాత్ర అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారిని విజేతలుగా ఎంపిక చేశామని చెప్పారు. వక్తృత్వంలో.. బి.సంజన(జీహెచ్‌ఎస్, నాగలాపురం), సి.మాధురి (గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్, తిరుపతి) కె.నవ్య (అంబేడ్కర్ గురుకులం, సూళ్లూరుపేట), డిబేట్‌లో.. వి.గుణవర్షిణి (ఎస్వీయూ క్యాంపస్, తిరుపతి), వీసీ జ్యోతిష్ (జడ్పీహెచ్‌ఎస్ ప్లస్, మంగళం ట్రెండ్స్), షార్ట్‌ఫిల్మ్ మేకింగ్‌లో.. జడ్పీహెచ్‌ఎస్ (ఊరందూరు), కేజీబీవీ (ఎర్రావారిపాలెం), అంబేడ్కర్ గురుకులం (సూళ్లూరుపేట) ఉన్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన డీవైఈవో బాలాజి మాట్లాడుతూ.. జీవ వైవిధ్యంపై అవగాహన పెంచేందుకు ఈపోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. న్యాయనిర్ణేతలుగా డాక్టర్ నెమిలేటి కిట్టన్న, డాక్టర్ రాధాకృష్ణ, చిన్నమ్మ వ్యవహరించారు. జిల్లా కోఆర్డినేటర్ హరిశంకర్, క్యాంపస్ స్కూల్ హెచ్‌ఎం సకీనమ్మ, రిసోర్స్ పర్సన్లు కల్పన, జయకర్, కృష్ణవేణి పాల్గొన్నారు.




షార్‌లోని కురుఫ్ భవనంలో నిర్వహించిన అంతరిక్ష దినోత్సవ సభలో ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ - పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, షార్ శాస్త్రవేత్తలు, పవన్ కుమార్తె ఆద్య, ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

దివ్యాంగురాలికి వీల్‌చైర్ పంపిణీ



డక్కిలి, ఆగస్టు 13 : మండలంలోని వెంబులూరు ప్రాథమిక పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న దివ్యాంగుడు గణేష్, గ్రామానికి చెందిన అమృతకు మంగళవారం వీల్‌చైర్, రూటర్లు పంపిణీ చేశారు. ఎంఈవో జగదీష్ బాబు, వెంకటేశ్వర్లు, అలెమ్‌కో సంస్థ ప్రతినిధి శ్రీధర్ పాల్గొన్నారు.

పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

డక్కిలి, ఆగస్టు 13: ఎలాంటి పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ చౌడయ్య హెచ్చరించారు. మంగళవారం ఎన్‌హెచ్ 565 జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. వరుసగా రెండు మూడు సార్లు పత్రాలు లేకుండా పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేసి నడిపిన వారిని జైలు పంపుతామన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేకపోతే జరిమానా విధిస్తామని చెప్పారు.

మందకృష్ణ కృషితోనే ఎస్సీ వర్గీకరణ



విజయోత్సవ సభలో డక్కిలి ఎమ్మార్పీఎస్ నేతలు

డక్కిలి, ఆగస్టు 13: మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని ఎమ్మార్పీఎస్ నాయకులు, ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ జి.మునెయ్య, మాదిగ ఉద్యోగ సమాఖ్య జిల్లా కార్యదర్శి డి.పెంచయ్య అన్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లో జరిగిన విజయోత్సవ సభకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ... వర్గీకరణకు సుప్రీం సానుకూలంగా స్పందించడంతో మాదిర రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మాదిగల దేవుడయ్యారన్నారు.

బంగ్లాదేశ్‌లో మారణకాండను ఖండిస్తున్నాం



మాట్లాడుతున్న చంద్రశేఖర్

గూడూరు, ఆగస్టు 13: బంగ్లాదేశ్‌లో గత కొద్ది రోజులుగా హిందువులతోపాటు మైనార్టీల పై జరుగుతున్న మారణకాండను పార్టీలకు అతీతంగా ఖండిస్తున్నామని జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు టి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బంగ్లాదేశ్‌లో హిందువులు, మైనార్టీలపై జరుగుతున్న మారణ కాండను అడ్డుకునేలా భారతప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతు న్నామన్నారు. కార్యక్రమంలో నాగార్జున, వంశీకృష్ణ, మనోజ్‌కుమార్, సాయికిరణ్, సుమన్, దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



బుట్టల అల్లిక శిక్షణ ఇస్తున్న సులక్ష్మి

గూడూరు, ఆగస్టు 13: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో తమ సంస్థ ఆధ్వర్యంలో పలు వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తు న్నట్లు సునీత సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక సంస్థ కార్యాలయంలో వైర్‌బుట్టల తయారీపై శిక్షణ ఇచ్చారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం కారణంగా పర్యావరణం దెబ్బతింటోందన్నారు. వైర్‌బుట్టలను వినియోగించి పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునన్నారు.

పురందేశ్వరిని కలిసిన గూడూరు నాయకులు



గూడూరు అర్బన్, ఆగస్టు 13: చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ అమ్మవారి అలయ కమిటీ చైర్మన్ పదవిని బీజేపీ నాయకులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిదేవి మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి విజయం కోసం బీజేపీ నాయకులు కష్టపడి పనిచేశారని, ముత్యాలమ్మ ఆలయ ట్రస్ట్ చైర్మన్ పదవిని బీజేపీ నాయకులకు కేటాయించాలని కోరారు. డి.గిరిధర్ రెడ్డి, పి.పురుషోత్తంరెడ్డి, పి.కోటేశ్వరరావు, కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా తపాలా సేవలు



ఆన్‌లైన్ సేవలపై అవగాహన కల్పిస్తున్న రాకేష్

కోట, ఆగస్టు 13: గ్రామీణ ప్రాంతాల్లో బ్రాంచ్ పోస్టాఫీసుల సేవ లు విస్తృత పరిచామని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్ తెలిపారు. మండలంలోని నెల్లూరుపల్లి కొత్తపాళెంలో బ్రాంచ్ పోస్టాఫీసు నెలకొలిపి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పోస్టాఫీసులో మంగళవారం డైమండ్ జూబ్లీ సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా బ్రాంచ్ పోస్టుమాస్టర్ అనురాధ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ క్యాంప్‌లో కొత్తపాళెం, నెల్లూరుపల్లి, వీపీ అగ్రహారంవాసులు పాల్గొన్నారు. అనంతరం పోస్టాఫీసు ఆన్‌లైన్ సేవలపై అనురాధకు సూచనలు చేశారు. తపాలాశాఖ గూడూరు ఏఎస్‌పి మణికంఠన్, సీనియర్ మేనేజర్ శరత్‌కుమార్ పాల్గొన్నారు.

మ్యానువల్ స్కావెంజర్లపై సర్వే

పెళ్లకూరు, ఆగస్టు 13: మండలంలో మ్యానువల్ స్కావెంజర్స్, ఇన్సానిటరీ లెట్రిన్స్‌పై సర్వే చేస్తున్నట్లు ఎంపీడీవో అన్నపూర్ణరావు తెలిపారు. మ్యానువల్ స్కావెంజర్లు, అదేవిధంగా ఇన్సానిటరీ లెట్రిన్స్ ఉన్నట్లయితే 14వ తేదీలోపు వివరాలు అందించాలని ప్రజలను కోరారు.